

కర్నూలు నగరంలో అనుమతి లేకుండా నిర్మించిన భారీ భవనం


అక్రమ నిర్మాణాలను అడ్డుకునేదెవరు?

నగర పాలక కార్యాలయంలోని పట్టణ ప్రణాళికా విభాగంలో అవినీతి హెచ్చుమీరింది. పాలన పూర్తిగా గాడి తప్పడంతో ఇక్కడి సిబ్బంది అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. నగరంలో వెలుస్తున్న అనధికారిక నిర్మాణాలే ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. నగర పాలక సంస్థ పరిధిలోని 52 వార్డుల్లో అనధికార భవన నిర్మాణాలు సుమారు వెయ్యికి పైగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇలాంటి భవనాలే ప్లానింగ్ విభాగంలోని అధికారులు, సిబ్బందిగా వరంగా మారాయి. ప్లానింగ్ సెక్రటరీల నుంచి ఉన్నతాధికారుల వరకు మామూళ్లకు అలవాటుపడటంతో అనుమతి లేకుండానే భవన నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయి.

కర్నూలు న్యూసిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):

- మామూళ్ల మత్తులో ప్లానింగ్ విభాగం
- అక్రమ వసూళ్లపైనే అధికారులు, సిబ్బంది దృష్టి
- కార్పొరేషన్ ఆదాయానికి గండి
- అవినీతి అక్రమాలపై కొనసాగుతున్న విచారణ





అశోక్‌నగర్‌లో..

నగర పాలక సంస్థలోని ప్రణాళికా విభాగంలో అంతర్లీనంగా ఉన్న ఆదాయ వనరులు పక్కదోవ పడుతున్నాయి. అధికారులు, సిబ్బందితోపాటు సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలు చేతివాటం ప్రదర్శించడంతో కార్పొరేషన్ ఆదాయానికి గండి పడుతోంది. ప్రధానంగా భవన నిర్మాణ అనుమతుల రుసుం, ప్రకటనల పన్ను, అక్రమ నిర్మాణాల రుసుము వసూళ్లలో నిర్లక్ష్యం, చేతివాటం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. కాగా 2019 నుంచి నయా పైసా రుసుం వసూలు చేయకపోవడం విభాగపు పని తీరును ప్రశ్నిస్తోంది. ఉన్నతాధికారుల అండదండలతో కొందరు ఉద్యోగులు, సిబ్బంది ఇష్టానుసారంగా వసూళ్లకు పాల్పడుతున్నారు. అడిగినంత డబ్బు ఇచ్చిన వారికి మాత్రమే అనుమతులు మంజూరు చేస్తున్నారు. ఇవ్వని వారి భవనాల దగ్గరకు వెళ్లి దౌర్జన్యంగా నిర్మాణాలను కూల్చడమే కాకుండా గౌండా కార్మికులపై దాడులకు దిగుతున్నారు. ఇటీవల ఓ వార్డులో నిర్మిస్తున్న భవనంలో పట్టణ ప్రణాళికా విభాగం ఉన్నతాధికారి పర్యవేక్షణలో సిబ్బంది సెంట్రింగ్ కార్మికులపై దాడులకు పాల్పడ్డారు. దీంతో కార్మికులకు దెబ్బలు తగలడంతో కార్పొరేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు.



కర్నూలు నగరపాలక సంస్థ కార్యాలయం

● ప్లానింగ్ సెక్రటరీల హవా..

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చారు. అయితే సచివాలయంలో 11 శాఖలకు సంబంధించి సెక్రటరీలు ఉంటారు. ఇందులో పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి ప్లానింగ్ సెక్రటరీ ఉంటారు. ఈ క్రమంలో కొందరు అధికారులు ప్లానింగ్ సెక్రటరీలను అడ్డం పెట్టుకుని డబ్బులు వసూలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. నగర పాలక సంస్థ పరిధిలో మొత్తం 133 సచివాయాలు ఉండగా 108 మంది ప్లానింగ్ సెక్రటరీలు ఉన్నారు. వీరంతా వారి వార్డు పరిధిలో జరుగుతున్న నూతన భవన నిర్మాణాలకు సంబంధించి ఎప్పటికప్పుడు నివేదికలను పట్టణ ప్రణాళిక విభాగం అధికారులకు పంపాలి. సచివాలయ వ్యవస్థ రాకముందు నూతన భవన నిర్మాణానికి అనుమతులు కావాలంటే మీసేవలో దరఖాస్తు చేసుకునే వారు. ప్రస్తుతం సచివాలయం ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న తరువాత ప్లానింగ్ సెక్రటరీ అందుకు సంబంధించిన పత్రాలను అప్‌లోడ్ చేసి స్థలాన్ని పరిశీలించిన అనంతరం బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్/అసిస్టెంట్ సిటీ ప్లానర్‌కు నివేదికలను పంపుతారు. ఈ తతంగమంతా పూర్తి కావాలంటే కనీసం నెల రోజులు పడుతుంది. అయితే దరఖాస్తు చేసుకున్న వారికి సంబంధించి వారి స్థలంలో ఏవైనా లోపాలు ఉంటే అధికారులు ప్లానింగ్ సెక్రటరీల ద్వారా స్థల యజమానికి సమాచారం చేరవేస్తారు. ఎంతో ఒకంత ముట్టజెప్పాలని, లేని పక్షంలో అనుమతి నిరాకరిస్తారని భయపడిస్తారు. దీంతో కొందరు స్థల యజమానులు డబ్బులు ముట్టజెప్పి తమ పనులు చేయించుకుంటున్నారు. ప్రతి రోజూ కనీసం 10 నుంచి 20 దాకా భవనాలకు అనుమతులు మంజూరు చేస్తున్నారు. ఒక్కో భవనానికి సుమారు రూ.20 వేల నుంచి రూ.లక్ష దాకా వసూలు చేస్తున్నారు. వీటితోపాటు రియల్‌ఎస్టేట్ వ్యాపారులు వేసే వెంచర్లు, విద్యాసంస్థలు, ఆసుపత్రులకు సంబంధించి అధికారులకు పెద్ద మొత్తంలో డబ్బులు అందుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ మేరకు నెలకు కనీసం రూ.50 లక్షలు అక్రమంగా వసూలు చేస్తున్నారు.

● అదుపు తప్పుతున్న ప్రణాళిక:

మున్సిపల్ కార్పొరేషన్‌కు ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న పట్టణ ప్రణాళిక విభాగం అదుపు తప్పుతోంది. ఆదాయం అనుకున్న స్థాయిలో పెరగడం లేదు. అక్రమాలు నిరోధించి పారదర్శకత పెంచడానికి చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. కర్నూలు నగర శివారు ప్రాంతాల్లో ఆక్రమణలు, అనుమతిలేని నిర్మాణాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. వీటిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ఆక్రమణలు, అనధికార నిర్మాణాలను చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అనధికార నిర్మాణాలు చేపడుతున్న స్థల యజమానులు ఇచ్చే మామూళ్లకు కక్కుర్తి పడి కార్పొరేషన్‌కు వచ్చే ఆదాయానికి గండికొడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

మిగతా 6లో..

విద్యుత్ చౌర్యం చేస్తే చర్యలు

కల్లూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని విద్యుత్‌శాఖ డీపీఈ ఈఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు. మంగళవారం నంద్యాల జిల్లాలోని కొత్తూరు, ఆర్. కొత్తపల్లి, అప్పనపల్లి, అహోబిలం, ఆర్.ఎస్. రంగాపురం, గుంటపల్లి, అంబాపురం గ్రామాల్లో ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అక్రమంగా విద్యుత్ వారుతున్న కనెక్షన్‌లు గుర్తించిన డీపీఈ ఈఈ ప్రదీప్‌కుమార్ బృందం ఆధ్వర్యంలో 74 కేసులు నమోదు చేసి రూ.1.38 లక్షలు జరిమానా విధించారు. విద్యుత్ చౌర్యాన్ని ఉపేక్షించమని సంస్థకు నష్టం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.



అక్రమ విద్యుత్ కనెక్షన్‌ను తొలగిస్తున్న డీపీఈ ఈఈ ప్రదీప్‌కుమార్

న్యూస్ బాక్స్

14న రాష్ట్ర ఇంటర్ స్కూల్ బ్యాండ్ పోటీలు

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక మాంటిస్సోరి ఇండస్ పాఠశాలలో ఈ నెల 14వ తేదీన రాష్ట్ర ఇంటర్ స్కూల్ బ్యాండ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శ్యామ్యూల్ పాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బ్యాండ్ పోటీలకు 11 జట్లు పాల్గొంటాయన్నారు. మొత్తం 300 మంది విద్యార్థులు హాజరవుతున్నారని చెప్పారు. సమగ్ర శిక్ష రాష్ట్ర సంచాలకులు బి.శ్రీనివాస రావు, కలెక్టర్ రంజిత్ బాషా హాజరవుతున్నారని వెల్లడించారు. ఇక్కడ గెలుపొందిన స్కూల్ బ్యాండ్ పాఠశాలలు కర్ణాటక దావనగిరిలో జరిగే, సౌత్ జోన్ పోటీల్లో పాల్గొంటాయని డీఈవో తెలిపారు.

రేపటి నుంచి డీఈడీ ప్రాక్టికల్స్

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): 2018-2020 విద్యా సంవత్సరంలో ప్రైవేట్ డీఈడీ కళాశాలల్లో అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహించడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్లు డైట్ ప్రిన్సిపాల్ పి.జనార్దన్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలోని ప్రైవేట్ డీఈడీ కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు ఈ నెల 15వ తేదీన ఉదయం 10:30 గంటలకు డైట్ కళాశాలలో సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ప్రైవేట్ డీఈడీ కళాశాలల ప్రిన్సిపాల్స్ తప్పక హాజరు కావాలన్నారు.

అడిషనల్ ఎస్పీగా హుస్సేన్ పీరా

కర్నూలు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కర్నూలు అడిషనల్ ఎస్పీగా హుస్సేన్ పీరాను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 1991 బ్యాచ్‌కు చెందిన ఈయన సొంత జిల్లా అనంతపురం, కర్నూలు, కడప జిల్లాల్లో పలు పోలీస్‌స్టేషన్‌లలో పని చేశారు. ఇటీవలే అడిషనల్ ఎస్పీగా పదోన్నతి పొంది పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన బదిలీల్లో భాగంగా ఈయనను కర్నూలు అడిషనల్ ఎస్పీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

ఆ రెంటిని రాజధానికి మార్చుతాం

- అమరావతికి లోకాయుక్త, మానవ హక్కుల కమిషన్..!
- అందుకు వీలుగా చట్ట సవరణ చేస్తాం
- కోర్టుకు స్పష్టం చేసిన రాష్ట్ర ప్రభుత్వం

కర్నూలు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఏపీ లోకాయుక్త సంస్థ, ఏపీ మానవ హక్కుల కమిషన్ (హెచ్‌ఆర్‌సీ) కర్నూలు నుంచి అమరావతికి తరలించనున్నారా..? రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానంలో బుధవారం జరిగిన విచారణలో అమరావతిలోనే ఈ రెండు ఉంటాయని ప్రభుత్వం తరుపు న్యాయవాది స్పష్టం చేశారు. అందుకు అనుగుణంగా చట్ట సవరణ చేస్తామని కోర్టుకు వివరించారు. అంటే.. ఏ క్షణమైనా ఏపీ లోకాయుక్త సంస్థ, ఏపీ మానవ హక్కుల కమిషన్ (హెచ్‌ఆర్‌సీ)లు కర్నూలు నుంచి తరలిపోయే అవకాశం ఉందని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. అయితే.. కర్నూలు నగరంలో ఏర్పాటు చేసిన వీటిని ఇక్కడే ఉంచాలని, కొత్త సంస్థలను తీసుకు రావడం దేవుడెరుగు.. ఉన్న సంస్థలను తరలించడం ఎంతవరకు భావ్యమని న్యాయకోవిదులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే జాతీయ న్యాయ విద్యా కళాశాల విజయవాడలో ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. తాజాగా ఈ రెండింటిని కూడా తరిలించేందుకు చట్ట సవరణ చేస్తామని సాక్షాత్తు హైకోర్టుకే తెలిపారంటే.. ఎప్పుడైనా తరలిపోయే అకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. ఏపీ హెచ్‌ఆర్‌సీ, ఏపీ లోకాయుక్త సంస్థల తరలింపుపై మద్దిపాటి శైలజ, ఏపీ సివిల్ లిబర్టీస్ అసోసియేషన్ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా ప్రభుత్వం తరపు న్యాయవాది ప్రభుత్వ ఆలోచన విదానం న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు.

● రాష్ట్ర విభజన తరువాత కొలుదీరిన టీడీపీ ప్రభుత్వం రాష్ట్ర రాజధానిగా అమరావతిని గుర్తించింది. రాజధాని నిర్మాణం కోసం ల్యాండ్ పూలింగ్ విధానం ద్వారా దాదాపు 33 వేల ఎకరాలు సేకరించారు. సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు సహా రాష్ట్ర ప్రధాన సంస్థలు అన్నింటిని కూడా అమరావతిలో ఏర్పాటు చేసేందుకు చంద్రబాబు సారథ్యంలోని ఆనాటి టీడీపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో హైదరాబాద్ నుంచి ఒక్కొక్కటిగా కార్యాలయాలు అమరావతికి తరలిస్తూ వచ్చారు. 2019లో జగన్ సారథ్యంలో ఏర్పడిన వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానుల అంశం తెరపైకి తీసుకొచ్చింది. అందులో భాగంగా కర్నూలు న్యాయ రాజధానిగా ప్రకటించారు. అసెంబ్లీలో తీర్మానం కూడా చేశారు.

మిగతా 6లో..



కర్నూలు నగరంలోని మానవహక్కుల కమిషన్ రాష్ట్ర కార్యాలయం

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి — జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి వెంకటశేషాద్రి — 7

సాయి ఈశ్వరుడి హత్య కేసు కొట్టివేత — బైరెడ్డికి ఊరట — 7

నేటి నుంచి 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు — 7

సైలెంట్ కిల్లర్ — ఏటేటా పెరుగుతున్న మధుమేహ బాధితులు — నేడు వరల్డ్ డయాబెటిక్ డే — 6

కాసుల కోసమే గోదాములు..!

- రైతుల అవసరాలు తీర్చని వైనం
- నాణ్యత లేకుండానే పూర్తి
- కోట్ల రూపాయలు వృథా

ఇది బనగానపల్లె నియోజకవర్గం కేంద్రంలోని భానుముక్కల పరిధిలో రవ్వలకొండ పైన నిర్మించిన గోదాము. భానుముక్కల పరిధిలోని దాదాపు ఏడు గ్రామాల రైతులు ఉపయోగించుకోవచ్చని చెబుతూ దీన్ని నిర్మించారు. ఇందుకోసం గత వైసీపీ ప్రభుత్వం రూ.75 లక్షలు వెచ్చించింది. అయితే రైతులు ఉపయోగించుకోవడానికి వీలు లేకుండా ఊరికి దూరంగా కొండపైన నిర్మించారు.

నంద్యాల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం గోదాముల నిర్మాణం పేరిట డబ్బులు నొక్కేసే పనికి తెరతీసింది. రైతులకు అనువుగా లేకుండా ఊరికి దూరంగా కట్టడంతో వీటిని ఉపయోగించుకోలేకపోతున్నారు. ఇక నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలు ఇవ్వడంతో కట్టిన కొన్ని రోజులకే గోదాముల గోడలు పగుళ్లు ఇచ్చాయి. ఈ గోదాములను పరిశీలిస్తే పూర్తిగా వైసీపీ అనుయాయులకు కోట్ల రూపాయలు కట్టబెట్టేందుకు నిర్మించారన్న విషయం స్పష్టమవుతోంది. గత వైసీపీ ప్రభుత్వం నంద్యాల జిల్లా వ్యాప్తంగా 255 గోదాములను నిర్మిస్తామని చెప్పింది. వీటిలో 500 మెట్రిక్ టన్నుల పంట ఉత్పత్తులను నిలువ చేసే గోదాములు, 1000 మెట్రిక్ టన్నులు పంట ఉత్పత్తులను నిలువ చేసే గోదాముల నిర్మాణాలను చేపట్టింది. వీటిని నిర్మించే సమయంలో ఆయా గ్రామాల రైతులకు ఉపయోగపడతాయా? వారి పంటల రవాణాకు అనువుగా ఉంటాయా? అనేది ఏమాత్రం ఆలోచించలేదు. ప్రస్తుతం 45 మాత్రమే అందుబాటులోకి వచ్చాయి. ఇవి కూడా ఊళ్లకు దూరంగా వాగులు, వంకల పక్కన ఉండటం వల్ల రైతులు ఉపయోగించుకోలేకపోయారు.

మిగతా 7లో...



ఇది రుద్రవరం మండలంలోని చందలూరు గ్రామంలో నిర్మించిన గోదాము. దీని నిర్మాణం కోసం వైసీపీ ప్రభుత్వం రూ.75 లక్షలు ఖర్చు చేసింది. ఇంత మొత్తంలో ఖర్చు చేసినా వైసీపీ ప్రభుత్వం ముందు చూపుతో ఆలోచించకుండా గ్రామానికి దూరంగా నిర్మించింది. ఇలా మనుషులు తిరగని ప్రాంతంలో గోదాము కడితే తమ పంట ఉత్పత్తులను ఎలా నిలువ చేసుకోవాలని రైతులు ప్రశ్నిస్తున్నారు.



తుంగా తీరం.. నీలి వర్ణం..






బుధవారం ఉదయం 6:30 గంటలకు మంచుతో నిండుకున్న తుంగభద్ర నది పరివాహకం

ప్రశాంత తుంగభద్ర అందాలు ఎప్పుడూ భిన్నంగానే ఉంటాయి. ఉధృతంగా ఉరకలెత్తినా.. రాష్ట్రాలు దాటి ఒంపుసొంపులతో ప్రవహించినా.. కావేవీ అందాలకు అనర్హం అన్నట్టు అగుపిస్తుంది తుంగభద్ర నది. బుధవారం సూర్యోదయానికి కొన్ని నిమిషాల ముందు ఇలా అందాల నీలివర్ణం తుంగభద్రను కమ్మేసింది. తర్వాత 6 గంటలపైన నీలివర్ణం కనుమరుగై మంచుదుప్పటి కప్పేసిన ఈ దృశ్యాలను ఆంధ్రజ్యోతి 'క్లిక్' మనిపించింది. నిత్యం బిజీగా ఉండే నగర ప్రజలు కర్నూలుకు మణిహారంగా ఉన్న ఈ నది అందాలను తెల్లవారుజామున తనివితీరా ఆస్వాదిస్తున్నారు.

- కర్నూలు రూరల్

బృందా తులసి వనం



- రాఘవరాయడికి ఇష్టమైన తులసి పూజ
- మూడు ఎకరాల విస్తీర్ణంలో సాగు
- శ్రీమఠంలో నిత్య పూజల్లో వినియోగం



తుంగభద్ర నది ఒడ్డున సాగు చేస్తున్న తులసి వనం

మంత్రాలయం రాఘవేంద్రస్వామికి తులసి లేనిదే పూజ లేదు. హిందువులు పరమపవిత్రంగా భావించే తులసి, బిల్వపత్రాలతో రాఘవరాయలకు పూజలు నిర్వహిస్తారు. మంత్రాలయంలో దాదాపు మూడెకరాల్లో ఐదు చోట్ల తుంగభద్ర నదితీరం.. బృందావన్ గార్డెన్ గెస్టు హౌస్, సంస్కృత పాఠశాల, గురునివాస్, పూర్వపు పీఠాధిపతుల బృందావనాల దగ్గర, వెంకటేశ్వరస్వామి గుడి వద్ద తులసి మొక్కలను విస్తారంగా పెంచుతున్నారు. ఇందుకు 21 మంది కూలీలను కేటాయించారు. సేంద్రియ రసాయనిక ఎరువులు కాకుండా సంప్రదాయ ఎరువులతో తులసివనం సాగు చేస్తున్నారు. ఎంతో నిష్ట, నియమ భక్తితో రాఘవేంద్రస్వామికి నిత్యం కిలోల తులసిదళాలతో పూజలు నిర్వహిస్తారు.

మంత్రాలయం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): తులసిని రెండు రకాలుగా పిలుస్తారు. ఒకటి రామతులసి.. మరొకటి కృష్ణ తులసి. మంత్రాలయంలో రామతులసిని సాగు చేస్తున్నారు. ఈ వనంలోకి ఎవరూ ప్రవేశించకుండా కట్టుదిట్టమైన రక్షణ నడుమ సాగు చేస్తున్నారు. ఈ తులసిలో అనేక ఔషధగుణాలు ఉంటాయి. సర్వరోగ నివారణిగా పిలిచే ఈ మొక్కలను దేవాలయాలు, ఇంటి ముందు, ఇంటి పెరటిలో పెంచుతుంటారు. హిందువులు దైవంగా భావించి కొలుస్తూ పూజలు చేస్తారు. పావని, సురభి పేర్లుగా తులసికి నామకరణం ఉంది. మంత్రాలయం రాఘవేంద్రస్వామి నిజ బృందావనానికి తులసి అర్చన సేవ, మూలరాముల పూజ, ఏకాదశి రోజున పూర్వపు పీఠాధిపతుల బృందావనాలకు తులసి మాల సమర్పణ చేస్తారు. తులసి కాండం, వేర్లు, తులసిమాలలు, హోమాల్లో కాండాలను ఉపయోగిస్తారు. దేవతార్చన సమయంలో ఒక్క తులసి పత్రం సమర్పిస్తే అనంత పుణ్యకోటి ప్రాప్తి లభిస్తుందని భక్తుల నమ్మకం.

తులసిమాలలకు ప్రసిద్ధి మంత్రాలయం

మంత్రాలయంలో తులసి కాండలు, వాటి కొమ్మలతో తులసిపూసలు తయారు చేస్తారు. దాదాపు 5 కుటుంబాలు తులసిపూసలు, మాలలు తయారు చేసి భక్తులకు అందుబాటులో ఉంచుతారు. భక్తుల విజ్ఞప్తి మేరకు బంగారు, వెండి, రాగి, ఇత్తడి, దారంతో ఒరిజినల్ తులసి పూసలు లభ్యమవుతాయి. తులసిమాలలు మెడలో ధరించడం వల్ల సువాసనతో పాటు వ్యాధినిరోధక శక్తిగా ఉపయోగపడుతుంది. కర్నూలు జిల్లాలో ఎక్కడా లేనంతగా మూడెకరాల్లో తులసి వనంను మంత్రాలయంలో నదితీరం, ఆహ్లాదకరమైన, స్వచ్ఛ సుందరమైన ప్రదేశాల్లో పెంచుతున్నారు.





తులసి తీర్థం పవిత్రం

తులసి తీర్థం పవిత్రమైనది. ఏడాది పాటు తులసి పూజ చేస్తే సర్వరోగాలు నివారణ అవుతాయని నమ్మకం. శ్రీకృష్ణునికి, శ్రీమహావిష్ణువుకి అత్యంత ప్రీతిపాత్రమైనది తులసి. మూలరాములు, జయరాములు, దిగ్విజయరాములకు, బృందావనాలకు నిత్యం తులసి అర్చన, పూజలు చేస్తారు. తులసి లేనిదే స్వామివారికి పూజ లేదు.

-సుబుధేంద్రతీర్థులు, పీఠాధిపతి, మంత్రాలయం



మూడెకరాల విస్తీర్ణంలో సాగు

- ఎల్.మాధవశెట్టి, ఏఏవో,

మంత్రాలయంలో పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆదేశాల మేరకు అత్యంత పవిత్రమైన స్థలంలో మూడెకరాల్లో తులసి వనాన్ని ఏర్పాటు చేశాం. 20 మంది కూలీలతో ఎటువంటి రసాయనక ఎరువులు, పిచికారి మందులు వాడకుండా సేంద్రియ ఎరువులతోనే, ప్రకృతికి అనుగుణంగా సాగు చేస్తున్నాం. భక్తులకు, ఇతరులకు తులసివనంలోకి అనుమతులు ఉండదు. నియమ నిష్ఠలతో పవిత్ర తులసి వనం సాగు చేస్తున్నాం. ప్రతిరోజు స్వామివారికి దాదాపు ఆరు కిలోల తులసి దళాలతో పూజలు చేస్తారు. పూర్వపు పీఠాధిపతుల బృందావనాలతో పాటు రాఘవేంద్రస్వామికి, మంచాలమ్మకు, వెంకటేశ్వరస్వామికి, సంస్థాన పూజలకు తులసి వినియోగిస్తున్నాం.



తులసి మొక్కలతో తయారైన వెండి తులసి మాలలు



తులసి కాండంతో మాలలు తయారు చేస్తున్న శిల్పులు

మృతదేహాలే మొదటి గురువులు

- వైద్య విద్యార్థులకు కేడావరిక్ ఓథ్



విద్యార్థులతో ప్రమాణం చేయిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టినరసమ్మ

కర్నూలు హాస్పిటల్ 13(ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులకు మృతదేహాలే మొదటి గురువులని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్. చిట్టినరసమ్మ అన్నారు. బుధవారం అనాటమీ విభాగంలో మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ వైద్య విద్యార్థులకు మృతదేహంపై ప్రమాణం(కేడావరిక్ ఓథ్)నిర్వహించారు. 250 మంది విద్యార్థులు పాల్గొనే కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. శరీరంలో ప్రతి అవయవాన్ని గురించి తెలుసుకోవాలని, మృతదేహాన్ని తప్పక గౌరవించాలని అన్నారు. వైద్య విద్యార్థులు మృతదేహంపై ప్రాక్టికల్స్ నిర్వహించాలని, మానవ శరీరంలోని అంతర్గతంగా ఏఏ భాగాలు ఎక్కడ ఉంటాయి.. ఎలా ఉంటాయో నేరుగా చూడటం జరుగుతుందన్నారు. మరణించినా కూడా వైద్య విద్యార్థులకు పాఠాలు నేర్పుతున్న మృతదేహానికి వారి కుటుంబ సభ్యులను గౌరవించి కృతజ్ఞత తెలపాల్సిన బాధ్యత వైద్యులు, విద్యార్థులపై ఉందన్నారు. అందుకే మొదటి సంవత్సరం విద్యార్థుల చేత కేడావరిక్ ఓథ్ కింద ప్రమాణం చేయించామని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ సాయి సుధీర్, హరిచరణ్, రుణుకాదేవి, విజయానంద బాబు అనాటమీ హెచ్ఓడీ పి.శోభారాణి, అసోసియేట్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.





సైలెంట్ కిల్లర్

- ఏటా పెరుగుతున్న మధుమేహ బాధితులు
- పట్టణాల్లో 50 శాతం
- నేడు వరల్డ్ డయాబెటిక్ డే

చక్కెర వ్యాధి ఆరోగ్యాన్ని మెల్లగా ధ్వంసం చేస్తుంది. అనేక ఇతర వ్యాధులు తీవ్రమయ్యేలా చేస్తుంది. ఒకప్పుడు 50 ఏళ్ల తర్వాత వచ్చే మధుమేహం ఇప్పుడు జీవనశైలి, ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం వల్ల 20 నుంచి 30 ఏళ్ల వాళ్లకు కూడా వస్తున్నది. మధుమేహంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు అంతర్జాతీయ మధుమేహ సమాఖ్య 2006 నుంచి వరల్డ్ డయాబెటిక్ దేను నిర్వహిస్తోంది. 1972లో సర్ ఫ్రెడరిక్ బాంటింగ్ ఇన్సూలిన్ కనిపెట్టడంతో ఆయన పుట్టిన రోజు నవంబరు 14న వరల్డ్ డయాబెటిక్ డేగా జరుపుకుంటున్నారు.

కర్నూలు హాస్పిటల్ 13(ఆంధ్రజ్యోతి): డయాబెటిక్ వ్యాధి ఇటీవల చాలా తీవ్రమైంది. గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణాల్లో అధికంగా షుగర్ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతోంది. పట్టణాల్లో 50 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 10 నుంచి 15 శాతంగా కనిపిస్తున్నది. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఎండోక్రైనాలజీ ఓపీ వారంలో మంగళ, శుక్రవారాల్లో ఉంటుంది. ప్రతి వారం 700 మంది మధుమేహ వ్యాధిగ్రస్తులు వస్తున్నారు. ఇందులో టైప్-1 బాధితులు, చిన్నారులు 100 మంది ఉండగా.. మిగిలిన రోగులు 600 మంది టైప్-2 ఉన్నారు. ఇందులో టైప్-1 బాధితులకు ఎండోక్రైనాలజీ విభాగం నెలకు ప్రతి రోగికి రెండు వైల్స్ ఇవ్వగా.. టైప్-2 రోగులకు మందులను ఉచితంగా అందిస్తున్నది. 20 పడకల సామర్థ్యం ఉన్న ఎండోక్రైనాలజీ విభాగం ప్రతి వారం 10 నుంచి 15 మంది అడ్మిషన్ పొందుతుంటారు.

షుగర్ స్థాయి ఎలా ఉండాలంటే:

- మన శరీరంలో చక్కెర స్థాయి పడగడుపున తినక ముందు 100 కన్నా తక్కువ ఉంటే మధుమేహం లేనట్లుగా భావించాలి. 126 పైన ఉంటే షుగర్ వ్యాధి ఉన్నట్లు గుర్తించి వైద్యులను సంప్రదించాలి.
- తిన్న రెండు గంటల తర్వాత చక్కెర స్థాయిలు 140లోపు ఉంటే నార్మల్. 140 నుంచి 199 చక్కెర స్థాయి ఉంటే ప్రి డయాబెటిక్ ఉన్నట్లు భావించి జాగ్రత్తలు తీసుకోవాలి.
- తిన్న తర్వాత చక్కెరస్థాయి 200 దాటితే షుగర్ ఉన్నట్లుగా చెప్పవచ్చు.
- మూడు నెలల చక్కెర స్థాయి 7 శాతం కంటే తక్కువ ఉండేలా చూడాలి. 5.6 నుంచి 6.4 శాతం ఉంటే ప్రిడయాబెటిక్, 6.5 శాతం ఉంటే షుగర్ ఉన్నట్లు చెప్పవచ్చు.
- తెల్ల అన్నం మహా ప్రమాదం: చక్కెర వ్యాధిగ్రస్థులు పోషకాలు పుష్కలంగా ఉండే ఆహారం తీసుకోవాలి. వరి అన్నం తింటే చక్కెర స్థాయిలు విపరీతంగా పెరుగుతాయి. బ్రౌన్ రైస్, చిరుధాన్యాలు తినాలి. డయాబెటిక్ ఉన్న రోగులు సీతాఫలం, మామిడి, సపోట పండ్లు తినకూడదు. ఆపిల్, బొప్పాయ, దానిమ్మ, చీని పండ్లను తినవచ్చు.
- జిల్లాలో 1.44 లక్షల రోగులు: వైద్య ఆరోగ్య శాఖ నిర్వహించిన ఎన్‌సీడీ సర్వేలో జిల్లాలో 1.44 లక్షల మంది మధుమేహ రోగులు ఉన్నట్లు గుర్తించారు. ఈ ఏడాది జనవరిలో ఎన్‌సీడీ ఇంటింటి సర్వేలో రోగులను గుర్తించారు.



● నేడు నర్సులకు అవగాహన సదస్సు

వరల్డ్ డయాబెటిక్ డేను పురస్కరించుకుని కర్నూలు జీజీహెచ్ ఎండోక్రైనాలజీ విభాగం హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సులకు అవగాహన సదస్సును గురువారం ఉదయం ఓల్డ్ సీఎల్‌జీలో ఏర్పాటు చేశాం. రోగికి చికిత్స అందించడంలో వైద్యుల తర్వాత ఆ స్థానం నర్సులదే. అందుకే షుగర్ రోగులకు ఇన్సూలిన్ ఎంత మోతాదులో ఇవ్వాలి.. మందులు ఎలా ఇవ్వాలి.. అనే చికిత్స విధానాలను వివరించనున్నాం.

- డా.పి. శ్రీనివాసులు, ప్రొఫెసర్ అండ్ హెచ్‌వోడీ, ఎండోక్రైనాలజీ విభాగం, కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి



● చివరి దశలో వస్తున్నారు

చాలా మంది షుగర్ వ్యాధితో కిడ్నీలు డ్యామేజ్ అయ్యాక, నరాల బలహీనత, పక్షవాతం, గుండె జబ్బులకు గురయ్యాక వస్తుంటారు. మధుమేహం ఉన్న వారు ప్రతి నెలా పరీక్షలు చేయించుకోవాలి. శరీరంలోని షుగర్ స్థాయిలను అదుపులో ఉంచుకోవాలి.

- డా. మీనుగ శ్రీనివాసులు, అసిస్టెంట్ ప్రొఫెసర్, జనరల్ మెడిసిన్, కర్నూలు జీజీహెచ్



● షుగర్‌ను అదుపులో ఉంచుకోవాలి

శరీరంలోని చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుకోవాలంటే వైద్యుల పర్యవేక్షణలో మందులు సక్రమంగా వాడాలి. కనీసం మూడు నెలలకోసారి వైద్యులను సంప్రదించాలి. చాలా మంది ఒకసారి పరీక్షలు చేయించుకుని ఏళ్ల తరబడి అవే మందులు వాడుతుంటారు. అలా చేస్తే వ్యాధి అదుపులో ఉండదు.

- డా.బి. భరత్, ఎండోక్రైనాలజిస్టు, కర్నూలు



అక్రమ నిర్మాణాలను అడ్డుకునేదెవరు..?

(5వ పేజీ తరువాయి)

నగరంలో వ్యాపార వాణిజ్య ప్రకటనల పన్ను వసూళ్లలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. గోడలపై రాతలు, ఫ్లెక్సీలు, ఇతరత్రా ప్రకటనలు, ప్రచారాలు చూసీ చూడనట్లు వదిలి వేస్తున్నారు. దీని ద్వారా సంస్థ ఆదాయానికి భారీ స్థాయిలో నష్టం వాటిల్లుతోంది. ఉన్నతాధికారులు వీటిపై దృష్టి సారించి అక్రమ వసూళ్ల అరికట్టడానికి కట్టుదిట్టమైన చర్యలు చేపడితే కార్పొరేషన్ ఆదాయం గణనీయంగా పెరిగే అవకాశం ఉంది.

అనధికార వసూళ్లు:

లైసెన్స్‌డ్ సర్వేయర్లు స్ట్రక్చరల్ ఇంజనీర్ల పేర్ల నమోదు వారి లైసెన్స్‌ల రెన్యువల్‌కు సంబంధించి సిబ్బంది ఇష్టానురాజ్యంగా వ్యవహరిస్తున్నారని సమాచారం. వీరు ప్రతి ఏటా తమ పేర్లు రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుంది. అయితే కొత్తగా రెన్యువల్ ఫీజులు చెల్లించకుండా పాత ఏడాది అనుమతులతోనే పనులు చేయించుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇందుకు ఒక్కో లైసెన్స్‌కు రూ.30 వేల దాకా మామూళ్ల తీసుకుంటున్నట్టు సమాచారం. సిబ్బందికి వ్యక్తిగతంగా ప్రయోజనం చేకూరుతుందే తప్ప కార్పొరేషన్‌కు మాత్రం ఆదాయం సమకూరడం లేదు.

● కొనసాగుతున్న విచారణ..

నగరానికి చెందిన ఓ వ్యక్తి పట్టణ ప్రణాళికా విభాగంలో అధికారులు, ప్లానింగ్ సెక్రటరీలు చేస్తున్న అవినీతి అక్రమాలపై నేరుగా సీఎంకు లేఖ రాశారు. ఈ మేరకు ప్రభుత్వ ఆదేశాల మేరకు రీజినల్ డైరెక్టర్ ఐదుగురు సభ్యులత కూడిన ఓ కమిటీని నియమించారు. ఇందులో చిత్తూరు మున్సిపల్ కమిషనర్ పి.నరసింహప్రసాద్, రాయదుర్గం కమిషనర్ వి.దివాకర్‌రెడ్డి, తిరుపతి డిప్యూటీ సిటీ ప్లానర్ మహాపాత్రో, ఆదోని మున్సిపాలిటీ రెవెన్యూ ఆఫీసర్ కేఎండీ నాసిర్, అనంతపురం ఆర్‌డీడీటీపీలో పని చేస్తున్న టీపీఏ ఓంకార్‌లు ఉన్నారు. డిప్యూటీ సిటీ ప్లానర్ సంధ్యారాణి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ రంగస్వామి, టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్లు శబరీష్, మంజులమ్మలతో పాటు వార్డు ప్లానింగ్ సెక్రటరీలో బీఎండీ రఫిక్ బాషా, వి.దివ్య, ఎస్.రూప, ఎం.రంగానథ్, ఉప్పెన నవీన్‌కుమార్‌లను కమిటీ సభ్యులు విచారిస్తున్నారు. ఇప్పటికే ప్లానింగ్ సెక్రటరీలను విచారించారు. తదుపరి అధికారులను విచారించనున్నారు. ఈ నెల 15వ తేదీలోగా విచారణ పూర్తి చేసిన నివేదికలను ఆర్‌డీఎంఏకు పంపాలని ఆదేశాలు అందాయి. ప్రస్తుతం ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులంతా ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లారు.

ఆ రెండింటిని రాజధానికి మార్చుతాం

(5వ పేజీ తరువాయి)



న్యాయ శాఖకు సంబంధించిన సంస్థలను కర్నూలులో ఏర్పాటుకు వైసీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందులో భాగంగానే తాత్కాలిక భవనం స్టేట్ గెస్ట్ హౌస్‌లో ఆంధ్రప్రదేశ్ మానవ హక్కుల కమిషన్ (హెచ్ఆర్‌సీ) ఏర్పాటు చేశారు. హైదరాబాద్ - బెంగళూరు వయా కర్నూలు జాతీయ రహదారి పక్కనే సంతోష్ నగర్‌లో ఏపీ లోకాయుక్త సంస్థను అద్దె భవనంలో ఏర్పాటు చేశారు. దిన్నెదేవరపాడులో శాశ్వత భవనంలో ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి ఏర్పాటు చేశారు. ఎన్నికల ముందు నగర శివారులో జగన్నాథ గట్టుపై జాతీయ న్యాయ విద్యా కళాశాల నిర్మాణానికి అప్పటి సీఎం జగన్ హడావుడిగా శంకుస్థాపన చేశారు. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక జాతీయ న్యాయ విద్యా కళాశాలను విజయవాడలో ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. అక్కడ మరో కళాశాల ఏర్పాటు చేస్తారా..? కర్నూలులో శంకుస్థాపన చేసిన కళాశాలనే తరలిస్తారా..? అన్నది స్పష్టత ఇవ్వలేదు. గత రెండు మూడేళ్లుగా కార్యకలాపాలు సాగిస్తున్న ఏపీ లోకాయుక్త సంస్థ, ఏపీ మానవ హక్కుల కమిషన్‌లను మాత్రం ఇక్కడి నుంచి తరలించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు స్పష్టం అవుతోంది. ఏపీ లోకాయుక్త, హెచ్ఆర్‌సీలను విజయవాడ తరలిస్తే ఆ సంస్థల్లో ఎలాంటి ఫిర్యాదులు చేయాలన్నా దాదాపు 400 కిలోమీటర్లు దూరం వెళ్లాల్సిందే. రాయలసీమ జిల్లాల ప్రజలకు అది సాధ్యమేనా అన్న ప్రశ్న తలెత్తుతోంది. ఈ రెండు సంస్థలను ఇక్కడే కొనసాగించాలని పలువురు కోరుతున్నారు.

సహకార వారోత్సవాలను విజయవంతం చేయండి



వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల కల్చరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): 71 వ అఖిల భారత సహకార వారోత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ రాజకుమారి పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్ ఛాంబర్‌లో సహకార వారోత్సవాల వాల్‌పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ వికసిత్ భారత్ నిర్మాణంలో భాగంగా సహకార రంగాల అభివృద్ధి, సంఘాల విజయాలను తెలియపరిచేలా 14 నుండి 20 వ తేదీ వరకు వారోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి వెంకట సుబ్బయ్య, డ్వామా పీడీ జనార్దన్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

అలా వదిలేశారు..!



సగం కూలి ప్రమాదకరంగా ఉన్న భవనాన్ని చూడండి. హొళగుంద మండలం సమ్మతగేరిలోని ప్రాథమిక పాఠశాలను ఒకప్పుడు ఇందులో నిర్వహించేవారు. కొన్నేళ్ల క్రితం ఈ పాఠశాలకు నూతన భవన నిర్మాణం పూర్తి కావడంతో అక్కడకు మార్చారు. అయితే పాత పాఠశాల భవనం మాత్రం ఇలా సగం కూలి ప్రమాదకరంగా తయారైంది. రహదారి పక్కనే ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయం ప్రజల్లో నెలకొంది. మరెమ్మ అవ్వ దేవాలయం పక్కనే ఉండడంతో భక్తులు, ఈ భవనం పక్క నుండే రాకపోకలు సాగిస్తుంటారు. ఈ భవనం ఎప్పుడు కూలుతుందో, ఎవరికి ప్రమాదం వాటిల్లుతుందో అని స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

-హొళగుంద

ఇలా వెళ్లిపోతున్నారు..!



ఈ ఏడాది వలసలు పెరిగిపోతున్నాయి. గ్రామాల్లో కూలి పనులు లేవు. అధికారులు సైతం ఉపాధి పనులు చూపించడంలో విఫలమయ్యారు. కల్పించిన పనులకు సకాలంలో కూలి డబ్బులు ఇవ్వడం లేదు. ఇక చేసేదేమీ లేక ప్రజలు వలసబాట పడుతున్నారు. గోనెగండ్ల మండలం నుంచి వారం రోజులుగా వలస బండ్లు కదులుతున్నాయి. బుధవారం అలువాల, కులుమాల, గంజహళ్లి గ్రామంలో నుంచి దాదాపు 200 మంది కూలీలు తెలంగాణకు వలస వెళ్లారు. అక్కడ పత్తి పొలాల్లో, పట్టణాల్లో సిమెంట్ పనులు చేసేందుకు పయనమయ్యారు.

-గోనెగండ్ల

జ్ఞాన భాండాగారం..

గ్రంథాలయం


- పాఠకులకు విస్తృత స్థాయిలో సేవలు
- నేటి నుంచి 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు



నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయం

కర్నూలు కల్చరల్/కొలిమిగుండ్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో ఉద్యమ కారులకు సమాచార కేంద్రాలుగా ఉంటూ అక్షరాస్యత సాధనలో ప్రముఖ పాత్ర పోషించిన ఘనత గ్రంథాలయానికే చెందు తుంది. నేటి ఆధునిక కాలంలోనూ పాఠకులకు విస్తృత స్థాయిలో సేవలందిస్తున్న ఈ పఠనాలయాలను గుర్తిస్తూ ఏటా నవంబరు 14న జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని పత్తికొండ, నంద్యాల, చాగలమర్రి తదితర ప్రాంతాల్లో నాటి స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని రగిల్చడంలో గ్రంథాలయాలు ప్రముఖంగా నిలిచాయి. స్వాతంత్ర్యానంతరం కర్నూలు నగరంలోని పాతనగరం గడియారం ఆసుపత్రి వద్ద గ్రంథాలయ సంస్థను, జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని 1959లో స్థాపించారు. వీటిని ఆనాడు ఎల్ఎల్ఏ (లోకల్ లైబ్రరీ అథారిటీ) సంస్థ నిర్వహించేది. కాగా 1972లో ప్రస్తుతం చిదంబరరావు వీధిలో ఉన్న సొంత భవనంలోకి మార్చారు. ఎల్ఎల్ఏ నుంచి గ్రంథాలయాలను రాష్ట్ర పౌర గ్రంథాలయ సంస్థ పరిధిలోకి చేర్చారు. అనంతరం జిల్లా గ్రంథాలయ సంస్థగా పేరు మారింది. గత 64 ఏళ్లుగా జిల్లా కేంద్ర గ్రంథాలయం పాఠకులకు విస్తృత సేవలందిస్తోంది. గురువారం నుంచి 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఉమ్మడి జిల్లాలో గ్రంథాలయ సంస్థ అందిస్తున్న సేవలపై ప్రత్యేక కథనం.

అందుబాటులో లక్షలాది పుస్తకాలు



కర్నూలు జిల్లా కేంద్రంలోని సెంట్రల్ లైబ్రరీతో కలుపుకొని 58 శాఖా గ్రంథాలయాలు, 1 గ్రామీణ గ్రంథాలయం, 133 పుస్తక నిక్షిప్త కేంద్రాలు (బీడీసీ)లతో సేవలు అందిస్తున్నాయి. తెలుగు, హిందీ, ఆంగ్లం, ఉర్దూ ఇతర భాషలకు సంబంధించిన 55,169 పుస్తకాలు పాఠకులకు అందుబాటులో ఉంటు న్నాయి. ఒక్క జిల్లా కేంద్రంలోనే పత్రికలు, రెఫరెన్స్, లెండింగ్ (పుస్తకాలు ఇంటికి ఇవ్వడం), ఇంటర్‌నెట్, సెర్ఫ్, స్టడీల్యాబ్ వంటి ఆరు విభాగాల్లో సేవలు అందిస్తోంది. జిల్లాలో 21 శాఖా గ్రంథాలయాలు సొంత భవనాల్లో కొనసాగుతుండగా, 22 అద్దె ప్రాతిపదికన, 17 రెంట్ ఫ్రీ ప్రాతిపదికన కొనసాగుతున్నాయి.

నిరుద్యోగుల పోటీ పరీక్షలకు..

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిరుద్యోగ యువత వివిధ పోటీ పరీక్షలు రాసేందుకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉంచారు. పుస్తక పఠనం కోసం ఏసీ స్టడీ హాలు అందుబాటులో ఉండగా సుమారు వందమంది కూర్చొని చదువుకునే అవకాశం లైబ్రరీలో ఉంది. స్టడీ హాలులో ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు నిరుద్యోగులు చదువుకునే ఏర్పాటు చేశారు. పాఠకుల సౌకర్యార్థం జిల్లా కేంద్రంతోపాటు కోవెలకుంట్ల, ఆళ్లగడ్డ, గోస్పాడు, ఆదోని, పాణ్యం, ఆలూరు, డోర్నిపాడు, నంద్యాల, డోన్, నందికొట్కూరు శాఖా గ్రంథాలయాల్లో అంతర్జాల సౌకర్యం కల్పించారు.

గ్రంథాలయ సెస్ నిధులు విడుదల చేస్తే మరిన్ని సేవలు



జిల్లా గ్రంథాలయ సంస్థకు నగరపాలక సంస్థ, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల నుంచి రావాల్సిన సెస్ నిధులు 13 కోట్లకు పైగా ఉన్నాయి. గ్రంథాలయ సంస్థ రుసుము కింద గ్రామ, నగర పంచాయితీలు, మున్సిపాలిటీలు, నగర పాలక సంస్థలు సెస్ వసూలు చేస్తున్నా యి. కానీ ఈ నిధులు గ్రంథాలయ సంస్థకు అందజేయడం లేదు. ఒక్క కర్నూలు నగరపాలక సంస్థ నుంచి రూ. 7.73 కోట్లు రావాల్సి ఉంది. అధికారులు గ్రంథాలయాల పురోభివృద్ధిపై దృష్టి పెట్టి లైబ్రరీ సెస్ నిధులు విడుదల చేయాలని కోరుతున్నాం. **- కె.ప్రకాశ్, కార్యదర్శి, జిల్లా గ్రంథాలయ సంస్థ, కర్నూలు**

నేటి నుంచి వారోత్సవాలు

కర్నూలు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, జాయింట్ కలెక్టర్ నవ్య వారోత్సవాలు ప్రారంభిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని 58 శాఖా గ్రంథాలయాల్లో గ్రంథాలయ వారోత్సవాలు గురువారం నుంచి ఆరంభిస్తున్నారు. ఈనెల 20 వరకు జరిగే ఈ వారోత్సవాల్లో 14న బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శనలు, అవగాహన సదస్సు, 16న గ్రంథాలయ యోధులపై ప్రముఖుల ప్రసంగాలు, 17న కవి సమ్మేళనం, సదస్సులు, రచయితల అభిప్రాయాలు, 18న విద్యార్థులకు ప్రతిభా పోటీలు, ఆటల పోటీలు, 19న మహిళలకు విభిన్న రకాల పోటీలు, 20న డిజిటల్ గ్రంథాలయాలపై అవగాహన, సామూహిక స్వీయ పఠనం, బహుమతుల ప్రదానం, ముగింపు వేడుకలు నిర్వహిస్తున్నారు.

కాసుల కోసం గోదాములు..!

(5వ పేజీ తరువాయి)

వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్లలో ఇలాంటి పనులే ఎక్కువగా చేసిందని, ఏమాత్రం ముందుచూపు లేకుండా వ్యవహరించటంతో రైతులకు మేలు జరగలేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కాంట్రాక్టర్లకు మేలు చేకూర్చేందుకు..

గోదాముల నిర్మాణాలను పరిశీలిస్తే వాటికి పట్టుమని రూ.20 లక్షల ఖర్చు కూడా ఉండదు. కానీ 500 మెట్రిక్ టన్నుల నిలువ చేసే గోదాము నిర్మాణానికి రూ.45 లక్షలు, 1000 మెట్రిక్ టన్నులు నిలువ చేసే గోదాము నిర్మాణానికి రూ.75 లక్షలుగా నిర్ణయించి అప్పటి వైసీపీ ప్రభుత్వం కాంట్రాక్టర్లకు కట్టబెట్టింది. కాంట్రాక్టర్లు పూర్తిగా డబ్బును దండుకోవటమే పనిగా పెట్టుకుని నాణ్యతకు కూడా తిలోదకాలిచ్చారు. కట్టిన కొన్ని రోజులకే వాటి నిర్మాణాలకు పగుళ్లు రావటమే కుకుండా, కింద ఫ్లోరింగ్ పెచ్చులు లేచిపోతున్నాయి. వెరసి గోదాముల నిర్మాణాలు కాంట్రాక్టరుకు డబ్బులు, రైతులకు తిప్పలు మిగిల్చాయే తప్ప ఏమాత్రం ఉపయోగం లేకుండా పోతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రుద్రవరం మండలం ఆర్.నాగులవరం, టి.లింగందిన్నె గ్రామాల రైతుల కోసం కొండపైన గోదాము నిర్మాణం చేపట్టారు. ఈ గోదాము ఇప్పటికీ పూర్తి కాలేదు. బనగానపల్లె నియోజకవర్గం టంగుటూరు సొసైటీ పరిధిలోని ఆరు గ్రామాల రైతుల కోసం గోదాము నిర్మాణం చేపట్టినా ముందుకు సాగలేదు. ఇలా జిల్లా వ్యాప్తంగా చేపట్టిన గోదాముల నిర్మాణాలు ముందుకు సాగలేదు. కాంట్రాక్టర్లు కట్టిన వాటికి బిల్లులు చెల్లిస్తేనే పనులు పూర్తి చేస్తామని చెప్పటంతో అసంపూర్తిగా నిలిచిపోయాయి.

పిడికెడు ధాన్యం నిల్వ చేయలేదు : రసూల్, చందలూరు



గత వైసీపీ ప్రభుత్వం గోదాము నిర్మాణం చేపడుతుం దనగానే మా పంట ఉత్పత్తులు నిలువ చేసుకోవచ్చని సంబరపడ్డాం. కానీ దానివల్ల ఎలాంటి ఉపయోగం లేదని నిర్మాణం పూర్తైన తర్వాత గానీ తెలిసి రాలేదు. దారి ఏర్పాటు చేయకుండానే గోదామును నిర్మించారు. ఇప్పటి వరకు పిడికెడు ధాన్యం కూడా నిలువ చేయలేదు. ఇలాంటి నిర్మాణం ఎవరినీ బాగు చేయడానికి కట్టారో అప్పటి వైసీపీ ప్రభుత్వానికే తెలియాలి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం దృష్టి సారించి రైతులు ఉపయోగించుకునేలా అందుబాటులోకి తీసుకురావాలి.

అసంపూర్తిగానే ఉంది : జనార్దన్, సీఈఓ, పెద్దకంబలూరు సొసైటీ

పెద్దకంబలూరు సచివాలయ పరిధిలోని పందిళ్లపల్లె గ్రామ పరిధిలో గోదాము నిర్మించారు. ఈ గోదాము పనులు అసంపూ ర్తిగానే ఉన్నాయి. అసంపూర్తి గోదాము నిర్మా ణంపై రైతులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారి నుంచి వచ్చే ఆదేశాలను బట్టి తదుపరి చర్యలు ఉంటాయి.

45 గోదాములు అప్పగించారు

జిల్లాలో 255 రైతులకు బహుళ ప్రయోజనార్థం గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గోదాములు నిర్మాణం చేపట్టింది. వీటిలో 500 మెట్రిక్ టన్నులు, వెయ్యి మెట్రిక్ టన్నులు సామర్థ్యం గల గోదాములు ఇప్పటి వరకు 45 గోదాములు పూర్తయ్యాయి. ఇంకా 210 గోదాముల నిర్మాణాలు పూర్తి కాలేదు. కాంట్రాక్టరు పూర్తి చేసిన వెంటనే రైతులకు అందుబాటులోకి తీసుకువస్తాం.

- వెంకటసుబ్బయ్య, జిల్లా కోఆపరేటివ్ అధికారి, నంద్యాల

ఏజెన్సీ ఉద్యోగి చేతివాటం

విధుల నుంచి తొలగింపు

మహానంది, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో పెద్దనంది విగ్ర హం వద్ద విధులు నిర్వహి స్తున్న ఏజెన్సీ ఉద్యోగి పావని భక్తుల నుంచి డబ్బులు వసూలు చేసి టిక్కెట్టు ఇవ్వడం లేదనే ఫిర్యాదులు రావడంతో విధుల నుంచి తొలగించినట్లు ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి బుధవారం తెలిపారు. ఒక్కొక్కరికి ప్రవేశం కోసం రూ.10 వసూలు చేసి టిక్కెట్టు ఇచ్చేందుకు ఏజెన్సీ ప్రతిపాదకన పావనిని నియమించారు. అయితే కొద్ది రోజుల క్రితం సదరు ఉద్యోగి భక్తుల నుంచి డబ్బు వసూలు చేసి టిక్కెట్టు ఇవ్వలేదని ఫిర్యాదు రావడంతో ఆమెను శాశ్వతంగా విధుల నుంచి తొలగించినట్లు ఈవో పేర్కొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి వెంకటశేషాద్రి

సి.బెళగల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి వెంకటశేషాద్రి అన్నారు. బుధవారం వెలుగు కార్యాలయం ఎంపీఎం రమేష్ అధ్యక్షతన చట్టాలపై మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామీణ మహిళలకు చట్టాలపై అవగాహన లేకపోవడంతో వేధింపులకు గురవుతున్నారని అన్నారు. మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోడానికి మండల కేంద్రాలలో ప్రత్యేకంగా అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మహిళా కమిషనర్ హేమలత, ఐసీడీఎస్ సీడీపీవో వరలక్ష్మి, వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ వెంకటస్వామి, ఎస్ఐ తిమ్మారెడ్డి, ఎంపీడీవో రాణెమ్మ ఉన్నారు. అనంతరం కస్తూర్బా పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.



కస్తూర్బా పాఠశాలలో భోజనాన్ని రుచి చూస్తున్న వెంకటశేషాద్రి

'వైసీపీ హయాంలోనే యురేనియం అనుమతులు'



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

కర్నూలు అర్బన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం యురేనియం తవ్వకాల కోసం సర్పంచుల తీర్మానాలతో తవ్వకాలకు అనుమతులు ఇచ్చిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. బుధవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఎంపీ బస్తిపాటి నాగరాజు, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కార్పొరేషన్ చైర్మన్లు బొజ్జమ్మ, దేవేంద్రప్పతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ యురేనియంపై కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. దేవనకొండ మండలంలో బంగారు గనులసర్వే పేరుతో 2019లో వైసీపీ ప్రభుత్వం యురేనియం తవ్వకాలకు అనుమతి ఇచ్చిందన్నారు. ఓటమి పాలైన తర్వాత వైసీపీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. డైరెక్టర్ నంద్యాల నాగేంద్ర, జేమ్స్, పోతురాజు రవి, చంద్రకాంత్, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

సాయి ఈశ్వరుడి హత్య కేసు కొట్టివేత

నందికొట్కూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ సాయి ఈశ్వరుడు హత్య కేసును కొట్టివేస్తూ విజయవాడ ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టు తీర్పు ఇచ్చింది. దీంతో బైరెడ్డి రాజశేఖర్, అలాగే బైరెడ్డి సిద్దార్థరెడ్డిలతో పాటు మరో ఏడుగురు ఈ కేసు నుంచి బయటపడ్డారు. పగిడ్యాల మండలం ముచ్చుమర్రి గ్రామానికి చెందిన సాయి ఈశ్వరుడు 2014 మార్చిలో కర్నూలులోని శకుంతల కల్యాణ మండపం సమీపంలో హత్యకు గురయ్యారు. ఆయన కుమారుడు బాలకృష్ణ 3వ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టారు. ముచ్చుమర్రి గ్రామానికి చెందిన చికెన్‌బాషా, బోయ మద్దిలేటి, పూడూరు రామకృష్ణ, బోయ నాగరాజు, బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, బైరెడ్డి శేషశయనారెడ్డి, బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, వడ్డె విజయ్, సద్దాం హుస్సేన్, వినోద్ కుమార్, వడ్డె అంజి, శ్రీనివాసులు, సురేంద్రబాబు, రాఘవేంద్ర రెడ్డిలపై కేసు నమోదైంది. సుదీర్ఘకాలంగా విజయవాడ ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారణ జరుగుతూ వచ్చింది. 14 మంది నిందితులు కాగా, అందులో శ్రీనివాసులు, సురేంద్రబాబు పేర్లు డిశ్చార్జి పిటీషన్‌లో తొలగించగా, ఇప్పటికే నాగరాజు, బైరెడ్డి శేషశయనారెడ్డి, వడ్డె విజయ్ అనారోగ్యంతో మృతి చెందారు. సరైన సాక్ష్యాధారాలు నిరూపణ కాకపోవడంతో ఆధారాలు లేవంటూ మిగిలిన 9 మందిపై కేసును కొట్టి వేస్తూ ఫాస్ట్‌ట్రాక్ కోర్టు తీర్పునిచ్చింది. ఈ కేసుపై బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి విజయవాడలో స్పందిస్తూ న్యాయం గెలిచిందన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు: కమిషనర్

కర్నూలు న్యూసిటీ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు నగర పాలక కమిషనర్ ఎస్. రవీంద్రబాబు తెలిపారు. బుధవారం నగర పాలక, పోలీసు అధికారులతో కలిసి గాయత్రీ ఎస్టేట్, ప్రభుత్వ సర్వజన వైద్యశాల, రాజ్‌విహార్, ఆనంద్ థియేటర్ ప్రాంతాలలో ఆయన పర్యటించారు. అలాగే కేసీ కెనాల్ వద్ద శుక్రవారం నిర్వహించనున్న కార్తీక దీపోత్సవానికి సంబంధించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆనంద్ థియేటర్ వద్ద మరో కూడలి ఏర్పాటు చేస్తామన్నారు. దీని ద్వారా బస్టాండు వైపు నుంచి వచ్చే వాహనాలు కిసాన్ ఘాట్, వినాయకా ఘాట్ వైపునకు మళ్లించవచ్చన్నారు. దీని వల్ల రాజ్‌విహార్ వద్ద ట్రాఫిక్ రద్దీ తగ్గుతుందన్నారు. పాత క్రిష్ణానగర్ రైల్వే బ్రిడ్జి వద్ద సమస్యను శాశ్వతంగా పరి ష్కరిస్తామన్నారు. గాయత్రీ ఎస్టేట్ కూడలి వెడల్పు తగ్గించడంతోపాటు రాజ్‌విహార్ వద్దవాటర్ ఫౌంటేషన్ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆరోగ్య అధికారి కే.విశ్వేశ్వరరెడ్డి, ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్, ఎంఈ సత్యనారాయణ, డీఈఈలు మనోహర్‌రెడ్డి, కృష్ణలత, గంగాధర్, శ్రీనివాసులు, మనోహర్‌రెడ్డి, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ దామోదర్, అంజాద్‌బాషా పాల్గొన్నారు.

ఏఐటీయూసీలో చేరిన అంబులెన్సు డ్రైవర్లు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల అంబులెన్సు డ్రైవర్లు ఏఐటీయూసీలో చేరారు. బుధవారం ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప డ్రైవర్లకు కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మునెప్ప మాట్లాడుతూ అంబులెన్సు డ్రైవర్లు ఎంతో వ్యయ ప్రయాసలతో రోగులు, చనిపోయిన శవాలను గమ్యస్థానాలకు చేరుస్తారన్నారు. అనంతరం కర్నూలు అంబులెన్సు డ్రైవర్లు, ఓనర్ల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఐ.శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా ఎస్.అబ్దుల్‌ఖాదిర్, ఎస్.రహీంబాషా, ప్రధాన కార్యదర్శిగా ఎస్.అఫ్సర్‌బాషా, జాయింట్ సెక్రటరీలుగా ఎస్.షాకీర్‌బాషా, ఆర్ భాస్కర్‌నాయక్, కోశాధికారిగా ఫజల్ బాషాలను ఎన్నుకున్నారు.

సోమిశెట్టిని కలిసిన నాయకులు

కర్నూలు అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నూతన కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లును టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు కేఈ జగదీష్ అభినందించారు. బుధవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పూలబొకేను అందజేశారు. పార్టీ ఆవిర్భావం నుంచి పని చేసిన సోమిశెట్టి వెంకటేశ్వర్లుకు ఛైర్మన్ పదవీ వరించందని కొనియాడారు. కార్యక్రమంలో ఆకెపోగు ప్రభాకర్, దాశెట్టి శ్రీనివాసులు, న్యాయవాదులు పాల్గొన్నారు.


సోమిశెట్టికి పూలబొకే ఇస్తున్న టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు

డీఆర్వోకు అభినందన


డీఆర్వోకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎన్జీవోలు

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కార్యాలయంలో బుధవారం జిల్లా ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్, ఏపీ జేఏసీ ఛైర్మన్ వెంగళ్ రెడ్డి ఆధ్వర్యంలో ఏపీ ఎన్జీవోలు జిల్లా రెవెన్యూ అధికారిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన వెంకటనారాయణమ్మను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఏపీ ఎన్జీవోస్ అసోసియేట్ అధ్యక్షుడు దస్తగిరి రెడ్డి, జిల్లా కార్యదర్శి జవహర్, నగర అధ్యక్షుడు కాశన్న, మద్దిలేటి, భాస్కర్‌రెడ్డి, బంగారి, రవిప్రకాష్, సాంబశివారెడ్డి, కృష్ణుడు, శ్రీనివాసులు, వరలక్ష్మి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా నగరంలో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉటుందని కర్నూలు డివిజన్ ఈఈ టి.శేషాద్రి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం బి.క్యాంప్ సబ్‌స్టేషన్ పరిధిలోని కాలనీల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కరెంట్‌కోత ఉంటుందని ఏడీఈ రాజేంద్రబాబు తెలిపారు. పనులు జరగని ప్రాంతాల్లో ప్రత్యామ్నాయంగా విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. ప్రజలు ఈ అసౌకర్యాన్ని గుర్తించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

జొన్న పంటకు తెగుళ్లు

ఆందోళనలో రైతులు

ఓర్వకల్లు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): జొన్న పంటకు తెగుళ్ల సోకడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రబీ మొదలైనా జొన్న పంట సెప్టెంబరు 2వ వారంలో సాగు చేశారు. సాగైన జొన్న పంటపై కత్తెర పురుగు ఉధృతి ఎక్కువైంది. గత ఏడాది ఆశించిన దిగుబడి లేకపోవడంతో ఈ ఏడాది అధిక విస్తీర్ణంలో జొన్న పంటను సాగు చేశారు. పంట ఏపుగా పెరిగినా కూడా పురుగు ఆకులను తినేస్తుండటంతో దిగుబడి తగ్గుతుంది. మండలంలోని ఓర్వకల్లు, గుట్టపాడు, శకునాల, సోమయాజులపల్లె, కొమరోలు, చెన్నంచెట్టిపల్లె, ఉప్పలపాడు, ఉయ్యాలవాడ తదితర గ్రామాల్లో దాదాపు 2వేల ఎకరాల్లో జొన్న పంటను సాగు చేశారు. అయితే జొన్న పంటకు కత్తెర పురుగు సోకి ఆకులను రంధ్రాలు చేస్తూ నమిలేస్తుంది. కంకి వచ్చే దిశలో పురుగు దాడి చేస్తుండటంతో పంట పూర్తిగా దెబ్బతిని దిగుబడి తగ్గుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పురుగు నివారణకు అనేక మందులు పంటపై పిచి కారి చేసినా ప్రయోజనం లేదని వాపోతున్నారు.


తెగుళ్లు సోకిన జొన్న పంట ఇదే..

తెగుళ్లతో నష్టపోతున్నాం



జొన్న పంటకు తెగుళ్ల సోకడంతో తీవ్రంగా నష్టపో తున్నాం. అధిక బడులు సాధించవచ్చని జొన్న పంటను సాగు చేశాం. కత్తెర పురుగు సోకి పం టంతా దెబ్బతింటోంది. ఎన్ని మందులు పిచికారి చేసినా ఫలితం లేదు. జొన్నకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. అయితే దిగుబడి తగ్గుతుంది.

\- కురువ సుంకన్న, రైతు, ఓర్వకల్లు

జొన్న పంటకు పురుగు దెబ్బ



కత్తెర పురుగు దెబ్బతో జొన్న పంటకు తీవ్రంగా నష్టం వాటిల్లింది. దీంతో దిగుబడి గణనీయంగా తగ్గుతుంది. గత ఏడాది జొన్న పంటకు ధర విపరీ తంగా ఉండ టంతో ఈ ఏడాది అధిక విస్తీర్ణంలో రైతులు సాగు చేశారు.

\- రాజు, రైతు పాలకొలను

ప్రతి ఏటా నష్టమే



ప్రతి ఏటా జొన్న పంటను సాగు చేస్తాను. అయితే పురుగు దెబ్బతో తీవ్రంగా నష్టపోతున్నాం. పంటపై పురుగుమందు పిచికారి చేసినా ప్రయో జనం లేదు. ప్రభుత్వం రైతు లను ఆదుకోవాలి.

\- మాలిక్ బాషా, రైతు, తిప్పాయపల్లె

నేటి నుంచి అందరికీ క్యాన్సర్ పరీక్షలు

● గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రారంభం

కర్నూలు, హస్పిటల్ 13(ఆంధ్రజ్యోతి): నాన్ కమ్యూని కబుల్ డిసీజ్ 3.0 కింద 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ జిల్లా వ్యాప్తంగా గురువారం క్యాన్సర్ పరీక్షలు ప్రారంభమౌతున్నట్లు డీఎంహెచ్ఓ డా.ఎల్. భాస్కర్ తెలిపారు. బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఎన్‌సీడీ ప్రోగాం ఆఫీసర్ హేమలత జిల్లా మలేరియా అధికారి నూక రాజుతో కలిసి డీఎంహెచ్ఓ విలేకరుల సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 18 సంవత్సరాలు నిండిన 16 లక్షల మందికి ఇంటి వద్దనే గ్రామీణ ప్రాంతాల్లో ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశాలు, పట్టణ ప్రాంతంలో ఏఎన్ఎంలు, ఆశాలు ఇంటింటా తిరిగి క్యాన్సర్ పరీక్షలు చేస్తారన్నారు. 909 మంది ఆరోగ్య సిబ్బందికి శిక్షణ ఇచ్చామని, వీరిలో 127 మంది మోడికల్ ఆఫీసర్లు, 28 మంది నర్సులు, ఎంఎల్‌హెచ్‌పీలు, సీహెచ్‌వోలు 428 మంది ఏఎన్ఎంలు 326 మంది శిక్షణ పొందారని తెలిపారు. కాన్సర్ పరీక్ష ప్రతి వారం సోమవారం నుంచి శుక్రవారం వరకు జరుగుతుందన్నారు. ప్రతి వైద్య బృందం ఐదు ఇళ్లను సందర్శించి క్యాన్సర్ పరీక్షలను చేస్తారని అనంతరం ఆన్‌లైన్ పేరిట నమోదు నిర్వహిస్తుందని తెలిపారు. ముఖ్యంగా రొమ్ము, సర్వైకల్ క్యాన్సర్‌తో పాటు బీపీ, డయాబెటిస్ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తారన్నారు. అనుమానిత కేసులు ఉంటే పీహెచ్‌సీ, అర్బన్ హెల్త్ సెంటర్‌లకు పంపిస్తారని వ్యాధి ఉన్నట్లు తెలిస్తే కర్నూలు స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్‌కు రెఫర్ చేస్తారన్నారు.


మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ భాస్కర్

ఎంపీ బస్తిపాటికి సన్మానం


ఎంపీని సన్మానిస్తున్న కురువ కార్పొరేషన్ డైరెక్టర్లు

కర్నూలు అర్బన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజును కురువ కార్పొరేషన్ డైరెక్టర్లు రామకృష్ణ, వెంకటరాముడు సన్మానించారు. బుధవారం నగరంలోని ఎంపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో వారు మాట్లాడారు. తమకు పదవులు రావడానికి సహకరించిన ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కురువ సంఘం నాయకులు పాల్గొన్నారు.

సుంకులమ్మను దర్శించుకున్న చైర్మన్

గూడూరు నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కె నాగలాపురం సుంకులాపరమేశ్వరిని ఏపీ కురువ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దేవేంద్రప్ప దర్శించుకున్నారు. బుధవారం దేవేంద్రప్ప కె నాగలా పురం చేరుకోగానే స్థానిక టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఛైర్మన్ అమ్మవారికి పూజలు చేశారు. ఛైర్మన్‌ను టీడీపీ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సాధికార సమితి సభ్యులు మల్లికార్జున, పరమేష్, భాను ప్రకాష్, ఎంపీటీసీ మద్దిలేటి, కర్లం యుగంధర్ బంగారు శ్రీను పాల్నొన్నారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న చైర్మన్ దేవేంద్రప్ప

ధర్నాను జయప్రదం చేయండి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): నిత్యావసర సరుకుల ధరలు, విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతూ గురువారం కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ పిలుపునిచ్చారు. బుధవారం కేకే భవన్‌లో జరిగిన వ్యవసాయ మార్కెట్, యార్డు ఉల్లి హమాలీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమా వేశంలో శ్రామిక మహిళా జిల్లా కార్యదర్శి పి.నిర్మల, సీఐటీయూ నగర కార్యదర్శి సీహెచ్.సాయిబాబా పాల్గొన్నారు.

17న పద్మశాలి కార్తీక వనభోజనం


కరపత్రం విడుదల చేస్తున్న సంఘం నాయకులు

కర్నూలు కల్చరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నగర పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఈనెల 17న కార్తీక వనభోజనం నిర్వహిస్తున్నట్లు సంఘం నాయకులు కస్తూరి వేమయ్య, మేడం సుంకన్న తెలిపారు. బుధవారం సంఘం కార్యాలయంలో పోస్టర్లను సంఘ నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలోని సుంకేసుల రోడ్డులోగల ఎస్ఎల్ఎన్ గార్డెన్స్‌లో పద్మశాలి కార్తీక వనభోజనం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనారాయణ, కస్తూరి ప్రసాద్, హరి, నాగరాజు పాల్గొన్నారు.

24న కురువ సంఘం ఆధ్వర్యంలో..

ఓర్వకల్లు: కురువ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 24న కర్నూలు నగరంలోని పెద్దపాడు రోడ్డులోని బీరప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో ఈనెల 24న కురువల కార్తీక వనభోజనం నిర్వహిస్తున్నట్లు సంఘం మండలాధ్యక్షుడు జీకె.అల్లబాబు తెలిపారు. బుధవారం ఓర్వకల్లులో కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖామంత్రి ఎస్.సవితమ్మ, ఎంపీలు బస్తిపాటి నాగరాజు, బీకే పార్థసారధితోపాటు పలువురు ప్రముఖులు రానున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు కె.పెద్దయ్య, సంఘం సభ్యులు అల్లస్వామి, రోళ్లపాడు మద్దిలేటి, చిన్న నాగన్న, జగన్, నడిపి స్వాములు తదితరులు పాల్గొన్నారు.


రైతులకు నష్ట పరిహారం చెల్లించాలి

ఓర్వకల్లు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఏపీఐఐసీలో భూములు కోల్పో యిన రైతులందరికీ నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం మండల కార్య దర్శి నాగన్న డిమాండ్ చేశారు. సీపీఎం పోరుయాత్ర మూడో రోజు బుధవారం గుట్టపాడు, కొంతలపాడు, ఉయ్యాలవాడ, శకునాల గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా నాగన్న మాట్లాడుతూ మండలంలో పలు పరిశ్రమల కోసం రైతుల నుంచి వేలాది ఎకరాల సాగు భూములను ప్రభుత్వాలు సేకరించాయన్నారు. ఏళ్ల గడుస్తున్నా ఎలాంటి నష్టపరిహారం అందక రైతులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని వాపో యారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా వెంటనే స్పందించి భూ బాధి తులందరికీ ఎకరాకు రూ.20లక్షల చొప్పున పరిహారం అందించి ఆదుకో వాలని కోరారు. ఈనెల 14న కర్నూలు కలెక్టరేట్ వద్ద ప్రజా సమస్యలపై తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు చంద్రబాబునాయుడు, మధుసూదన్, మద్దిలేటి, చాంద్‌బాషా, సభ్యులు మాసుంబాషా, మహబూబ్‌బాషా, చిన్న మద్దిలేటి, రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

భూ సమస్యలు పరిష్కరిస్తాం

తహసీల్దార్ రామాంజనేయులు



గూడూరు నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రీ సర్వేలో వచ్చిన భూ సమస్య లకు పరిష్కరిస్తామని తహసీల్దార్ రామాంజనేయులు అన్నారు. బుధవారం గూడూరు తహసీల్దార్ కార్యాలయంలో ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

ప్రశ్న: రీ సర్వేలో వచ్చిన సమస్యలను ఎలా పరిష్కరిస్తారు?.

జవాబు: గూడూరులో మండలంలోని తొమ్మిది గ్రామాల్లో రీ సర్వే ప్రక్రి య జరిగింది. రైతుల భూములకు సంబంధించి విస్తీర్ణం ఎక్కువ, తక్కు వగా వచ్చినట్లు ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై గ్రామాల్లో గ్రామసభలను నిర్వహించి రైతులను నుంచి అర్జీలు స్వీకరించాం. వీటిని పరిశీలించి పరి ష్కారం చూపుతాం.

ప్రశ్న: రీ సర్వే టీంలో ఎవరెవరూ ఉంటారు?

జవాబు: రీ సర్వే టీంలో తహసీల్దార్‌తోపాటు డిప్యూటీ తహసీల్దార్, మండల సర్వేయర్, వీఆర్వో, ఆర్ఐ, విలేజ్ సర్వేయర్ సభ్యులుగా ఉం టారు.

ప్రశ్న: జాయింట్ ఎల్‌పీల సమస్యను ఎలా పరిష్కరిస్తారు?

జవాబు: భూములకు సంబంధించి జాయింట్ ఎల్‌పీ సమస్యపై రైతుల నుంచి అర్జీలు వచ్చాయి. కుటుంబంలో అన్నదమ్ములకు సంబంధించి జాయింట్ ఎల్‌పీలు వచ్చాయి. రైతుల సహకారంతో పరిష్కారం చూపు తాం.

ప్రశ్న: పట్టాదారు పాసుపుస్తకాలు రావడంలో ఎందుకు జాప్యం ?

జవాబు: గతంలో రైతులకు సంబంధించి పట్టాదారు పాసుపుస్తకాలు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చేవి, వాటిని ఎంట్రీ చేసుకోని వీఆర్వోలు రైతులకు ఇచ్చేవారు. అయితే ప్రస్తుతం పట్టాదారు ఈ పాసుపుస్తకం రైతుల ఇంటికి వెళ్తున్నాయి. ఒక వేళ రాకపోతే రీ ప్లేస్ చేసుకోవాలి.

అలరించిన వయోలిన్ సంగీత కచేరీ

కర్నూలు కల్చరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ శారదా సంగీత, నృత్య కళాశాలలో బుధవారం శిక్షణలోని విద్యా ర్థులతో నిర్వహించిన వయోలిన్ సంగీత కచేరీ ఆసాంతం అలరించింది. కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ మునికుమార్ ఆధ్వర్యంలో కళాశాలలో వయో లిన్ శిక్షణ పొందుతున్న విద్యార్థులు ఈ కచేరీలో పాల్గొన్నారు.

బాధితుడికి గొలుసు అప్పగింత



బాధితుడికి గొలుసును అందజేస్తున్న పోలీసులు

కర్నూలు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రైల్లో పోగొట్టుకున్న బంగారు గొలుసును రైల్వే పోలీసులు బాధితునికి అప్పగించారు. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన శేఖర్ ఈనెల 12వ తేదీన రైల్లో ప్రయాణిస్తూ కంభం రైల్వే స్టేషన్‌లో దిగాడు. ఇంటికి వెళ్లిన తర్వాత చూసుకుంటే తన మెడలో ఉన్న 3.5 తులాల బంగారు గొలుసు కనిపించలేదు. దీంతో వెంటనే వచ్చి రైల్వే స్టేషన్‌లో విధుల్లో ఉన్న రైల్వే పోలీసులను సంప్రదించారు. ఆ కానిస్టేబుల్ రైలులో డ్యూటీలో ఉన్న సూర్యప్రకాష్, సలీం అనే కానిస్టేబుళ్లకు సమాచారం అందించారు. వారు నంద్యాలకు రైలు వచ్చే సరికి ఆ ప్రయాణికుడు ప్రయాణించిన బెర్తు వద్దకు వెళ్లి పరిశీలిస్తే అక్కడ బంగారు గొలుసు కనిపించింది. ఆ బంగారు గొలుసును బుధవారం శేఖర్‌కు అప్పగించినట్లు రైల్వే సీఐ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు.

ఓటమి గెలుపునకు నాంది: డీఈవో

కర్నూలు రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఓటమి గెలుపునకు నాంది అని జిల్లా విద్యాశాఖ అధికారి శ్యామ్యూల్‌పాల్ అన్నారు. బుధవారం చిన్నటేకూరులోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిష్ స్కూల్ మైదానంలో అంతర్ పాఠశాలల క్రీడా పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా డీఈవో శ్యామ్యూల్‌పాల్ హాజరై మాట్లాడుతూ క్రీడాకారులు గెలు పోటములను సమానంగా స్వీకరించాలన్నారు. బాలల దినోత్సవం సంద ర్భంగా చిన్నారులకు డీఈవో శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఫుట్‌బాల్ క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఛైర్మన్ కెజెరెడ్డి, ప్రిన్సిపాల్ జస్మిత్‌కౌర్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాసులు, పరశురాముడు పాల్గొన్నారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఈవో

ఖమ్మం జిల్లా వాసిపై కేసు నమోదు

కర్నూలు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా సింగరేణి మండలం కారేపల్లి గ్రామానికి చెందిన రవిపై నగరంలోని నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. కర్నూలు గోపి నగర్‌కు చెందిన ఛత్రపతి రెడ్డి అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడు. ఛత్రపతి రెడ్డి, రవికి మధ్య రూ.1.20 కోట్ల నగదుపై స వివాదం ఉంది. అందులో భాగంగా 2020లో కారేపల్లి పోలీస్‌స్టేషన్‌లో రవి, అతడి సోదరుడు జగన్‌లపై కేసు నమోదైంది. ఈ కేసుకు సంబంధించి రాజీ కావాలని కొంతకాలంగా ఛత్రపతి రెడ్డిని రవి బెదిరిస్తున్నాడు. అంతటితో ఆగకుండా ఛత్రపతి రెడ్డి సోదరుడి ఫొటోలను అసభ్యకరంగా మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. దీంతో పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు.


రాబోయే రోజుల్లో బీసీలదే అధికారం

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాబోయే రోజుల్లో బీసీలదే అధికారమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏపీ అధ్యక్షుడు యర్రసాని నాగేశ్వరావు యాదవ్ అన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సం ఘం ఏపీ అధ్యక్షుడిగా నాగేశ్వరావు యాదవ్ ఆ సంఘం జాతీయ అధ్య క్షుడు ఆర్.కృష్ణయ్య నియమించారు. ఈసందర్భంగా నాగేశ్వర యా దవ్ మాట్లాడుతూ బీసీల అభివృద్ధి, సంక్షేమం కోసం పోరాటం చేస్తామన్నారు.

నిధుల కేటాయింపుపై హర్షం

కర్నూలు అర్బన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఎస్సీల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.18,497 కోట్లు, ఎస్టీల కోసం రూ.7,557 కోట్ల నిధులు కేటాయించిందని ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి గిడ్డన్న హర్షం వ్యక్తం చేశారు. బుధవారం నగరంలోని పాత బస్టాండ్ సర్కిల్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ నాయకులు ఎస్సీసెల్ అధ్యక్షులు పి.శివ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి: ఈఈ


మాట్లాడుతున్న విద్యుత్ ఈఈ

సి.బెళగల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఈఈ విజయరాజు అన్నారు. బుధవారం మండల విద్యుత్ కార్యాలయంలో ఏఈ సుకుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా విజయరాజు మట్లాడుతూ గ్రామాల్లో అధికంగా రైతులు రాత్రి సమయాలలో పంటలకు నీరు పెట్టుకోవడానికి మోటార్ల దగ్గరకు వెళ్లే ముందు టార్చిలైటు తప్పనిసరిగా తీసుకెళ్లాలని అన్నారు. మోటార్లను ఆన్ చేసే ముందు రైతులు చేతులకు ప్లాస్టిక్ కవరు ధరిం చాలన్నారు. రైతులకు విద్యుత్ అంతరాయం కలగకుండా చూడాలని డీఈ జేసన్, ఏఈ సుమంత్‌లకు ఆదేశించారు. ఈసమావేశంలో విద్యుత్ లైన్‌మెన్లు, రైతులు పాల్గొన్నారు.

పులకుర్తిలో 'పొలం పిలుస్తోంది'

కోడుమూరు రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పులకుర్తి గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం వ్యవసాయాధికారి రవిప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఆయన పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా ఏవో రవిప్రకాష్ మాట్లాడుతూ మొక్కజొన్నలో వచ్చే కత్తెర పురుగుపై రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కత్తెర పురుగు నివారణకు ఎకరాకు 12 నుంచి 15 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలని సూచించారు. కత్తెర పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే ఇమామెక్టిన్ బెంజోయేట్ లేదా క్లోరంత్రనిల్ ప్రోల్ మందును మొక్కజొన్న సుడిలో పోయాలన్నారు. అలాగే వేరుశనగలో రబ్బరు పురుగు, రసం పీల్చే పురుగు గుర్తిస్తే అసిఫేట్‌తోపాటు క్వినాల్‌ఫాస్ మందు పిచికారి చేయాలని సూచించారు. రబీ పంటలకు పీఎం ఫసల్ బీమా యోజన కింద డిసెంబరు 15 లోగా ప్రీమియం చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో కొండయ్య, అంజలి పాల్గొన్నారు.



పంట పొలంలో రైతులతో వ్యవసాయ అధికారులు

ఐదు తరగతులకు ఒకే గది


టెంటు కింద ఐదో తరగతి విద్యార్థులు


వంట గదిలో మరో తరగతి విద్యార్థులు

- ఇబ్బందిపడుతున్న విద్యార్థులు
- ప్రాథమిక పాఠశాల దుస్థితి

ఆదోని, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోట్ల విజయ భాస్కర్ రెడ్డి కాలనీ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల కొనసాగుతోంది. ఐదు తరగతులను ఒకే గదిలో నిర్వహిస్తున్నా రు. స్థానికంగా పాఠశాల అవసరం ఉండటంతో పట్టణంలోని కేవీబీఆర్ నగర్‌లో ప్రభుత్వ భవనం నిర్మించి అందులోకి మార్చారు.

ఒకే గదిలో ఐదు తరగతులు..

ఈ పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 94 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి నలుగురు ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. అయితే అన్ని తరగతులు ఒకే గదిలో ఉండటంతో గందరగోళంగా మారింది.

ఎండలోనే బోధన

పాఠశాలలో తగరగతి గదుల కొరత ఉండటంతో ఐదో తరగతి విద్యార్థులకు సంపుపై చిన్న టెంటు వేసి బోధిస్తున్నారు. ఐదో తరగతిలో 28మంది విద్యార్థులు ఉన్నారు. అలాగే వంట గదిలో నాలుగో తరగతి విద్యార్థులు చదువుతున్నారు. ఇక మూడో తరగతిలో 23 మంది విద్యార్థులుండగా వారిని క్లాస్ రూములో కూర్చోబెట్టారు. ఒకటి, రెండో తరగతి విద్యార్థులను వరండాలో కూర్చోబెట్టారు. విద్యాధికారులు స్పందించి నూతన తరగతి గదులు నిర్మించాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

అదనపు గదుల కోసం ప్రతిపాదనలు పంపాం

పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. గతంలో అద్దె భవనంలో ఉన్న పాఠశాల ఇక్కడకు మార్చాం. నిదులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం.

- శ్రీనివాసులు, ఎంఈవో, ఆదోని

పంటలకు లో ఓల్టేజీ సమస్య


మద్దికెరలోని విద్యుత్ సబ్ స్టేషన్

- రైతులు, ప్రజల ఇబ్బంది
- పనులు చేసుకోలేక అల్లాడుతున్న చిరు వ్యాపారులు

మద్దికెర, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇటు విద్యుత్ కోత, అటు లో ఓల్టేజీ సమస్యతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 8 పంచాయతీ లుండగా, 40వేల జనాభాచ దాదాపు 11వేలకు పైగా కనెక్షన్లు ఉన్నాయి. మద్దికెరలో విద్యుత్ ఉప కేంద్రాన్ని నిర్మించారు. అనధికార విద్యుత్ కోతలకు తోడు విద్యుత్ వినియోగం పెరిగి, ట్రాన్స్‌ఫారంపై లోడు పెరిగి, ట్రిప్ అవుతున్నాయి. మండల కేంద్రంలోని కురవ వీధి, గిడ్డయ్య వీధిలో టీవీలు, మోటర్లు కాలిపోయాయి. కొన్ని గ్రామాల్లో రాత్రి 10 గంటల వరకు లోవోల్టేజీ సమస్య ఉంది. పొలాలకు నీరు పెట్టే సమయం కావడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. విద్యుత్ అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలో విద్యుత్ కోతలతో హోటళ్ల యజమానులు , చిరు వ్యాపారులు, జిరాక్స్ షాపుల వారు ఇబ్బంది పడుతున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి విద్యుత్ కోతలు లేకుండా చూడాలని కోరుతున్నారు.

మరమ్మతులు చేస్తున్నందుకే..

విద్యుత్ మరమ్మతుల పనులు జరుగుతున్నందుకే విద్యుత్ సరఫరాలో అంతరాయం వస్తోంది. ఇకపై విద్యుత్ కోతలు లేకుండా చూస్తాం

- మహ్మద్ రఫీ, విద్యుత్ ఏఈ

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం


లైబ్రరీలో పుస్తకాలను పరిశీలిస్తున్న పాఠకులు

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారం పట్టణంలోని శాఖా గ్రంథాలయం, ఆర్ట్స్ కళాశాలలో ప్రారంభమయ్యాయి. గ్రంథాలయ అధికారి సుజాత మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అన్నారు. గ్రంథాలయాలను వినియోగించుకోవాలని సూచించారు. ఆర్ట్స్ కళాశాలలో విద్యార్థులకు లైబ్రరీలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ మురళీమోహన్ గ్రంథాలయ అధికారి వేణుగోపాల్, సుధాకర్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం


ఆర్థిక సాయం చేస్తున్న నాయకులు

ఆస్పరి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తెర్నేకల్ అంగన్వాడీ టీచర్ సజీవమ్మ భర్త అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో ఏఐటీయూసీ మండల కార్యదర్శి కృష్ణమూర్తి, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ నాయకులు విజయలక్ష్మి, పరిమిల, రుతమ్మ ప్రమీల, ప్రశాంతి, విమల చేతుల రూ.17వేలు ఆర్థిక సాయం చేశారు. నాగవేణి, మంజు, చిట్టెమ్మ, హేమావతి, వరలక్ష్మి పాల్గొన్నారు.

యురేనియం తవ్వకాల నిలిపివేతపై హర్షం


చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేస్తున్న కప్పట్రాళ్ల ప్రజలు

దేవనకొండ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో యురేనియం తవ్వకాలు జరపమన్న హామీ పట్ల కప్పట్రాళ్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు బుధవారం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కప్పట్రాళ్ల రిజర్వు ఫారెస్టులో ఎలాంటి తవ్వకాలు జరపమంటూ టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యేలు శ్యాంబాబు, బోగ్గుల దస్తగిరి, టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ ప్రకటించడం పట్ల ధన్యవాదాలు తెలిపారు. తవ్వకాల భయంతో ఆందోళన చెందిన ప్రజలు శాంతించారు. టీడీపీ నాయకులు మల్లికార్జున, గ్రామస్తులు చింపి ఈరన్న, చింతా మధుసూదన్, రవికుమార్, ప్రోగ్రామ్ మేనేజర్ నారాయణ, రైతుసంఘం అధ్యక్షులు రాజు, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ


సీసీ రహదారికి భూమి పూజ చేస్తున్న నాయకులు

పత్తికొండ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చక్కరాళ్ల పంచాయతీ మజారా గ్రామం కురువలదొడ్డిలో బుధవారం టీఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు మునినాయుడు, బిసిసెల్‌నాయకుడు తిమ్మరాజు సీసీ రహదారి నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే శ్యాబాబు ఇచ్చిన హామీమేరకు రూ.47 లక్షల ఉపాధి నిధులను కేటాయించారని తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్ బింగి కరుణాకర్ ఉన్నారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి

ఆలూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం నిత్యావసరాల ధరలు తగ్గించాలని సీపీఎం నేత నారాయణ స్వామి డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ కార్యాలయాల వద్ద తలపెట్టిన ప్రజాపోరును విజయవంతం చేయాలన్నారు. ప్రభుత్వం సూపర్ సిక్స్ ఉచిత ఇసుకను అమలు చేసి పెరిగిన విద్యుత్ చార్జీలు తగ్గించాలన్నారు. ఈశ్వర్ గౌడ్, గోవర్ధన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నారాయణ స్వామి

స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి

- ముగిసిన ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభలు


మాట్లాడుతున్న షాబీర్ బాషా

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లు మండలంలో స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న, ప్రధాన కార్యదర్శి షాబీర్ బాషా డిమాండ్ చేశారు. ఆదోనిలో ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభలు బుధవారంతో ముగిశాయి. విద్యా సమస్యలపై తీర్మానాలు, కమిటీని ఎన్నుకున్నారు. విద్యారంగ అభివృద్ధిని విస్మరించారని, ఉర్దూ యూ నివర్సిటీ పనులు తక్షణమే ప్రారం భించాలని డిమాండ్ చేశారు. ఆర్‌యూలో నూతన కోర్సులు ప్రవేశపెట్టి ఖాళీగా పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఆదోనిలో మెడికల్ కళాశాల పనులను ప్రారంభిం చాలని, కోడుమూరు, ఆదోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు సొంత భవనాలు నిర్మించాలన్నారు. అధ్యక్షుడిగా సోమన్న, ఉపాధ్యక్షుడిగా రంగస్వామి, వీరేష్, శ్రీకాంత్ ప్రధాన కార్యదర్శిగా షాబీర్ బాషా, సహాయ కార్యదర్శిగా శరత్ కుమార్, దస్తగిరి, థామస్‌లను ఎన్నుకున్నారు.

ప్రభుత్వ భూమిని గుర్తిస్తాం : ఆర్డీవో

దేవనకొండ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): దేవనకొండ క్రాస్ వద్ద కుంకనూరు రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూమిని గుర్తించి, హద్దులు వేయనున్నట్లు పత్తికొండ ఆర్డీవో భరత్‌నాయక్ అన్నారు. నాలుగేళ్లుగా భూ వ్యాపారులు, కులసంఘాల నాయకులకు మధ్య సర్వే నెంబరు 591తో వివాదాలున్నాయి. దీన్ని పేదల పంచాలని కుల సంఘాలు కోరుతుండగా, ప్రజా ప్రయోజనాలకు ఉపయోగిస్తామని అధికారులు పేర్కొంటున్నారు. తహసీల్దార్ లోకేశ్వరయ్య, డీటీ సుదర్శనం, డివిజనల్ సర్వేయర్ దేవేంద్రనాథ్ ఉన్నారు.


దేవనకొండ టర్నింగ్ వద్ద మాట్లాడుతున్న ఆర్డీవో

డీఎస్సీలో వెయిటేజీ ఇవ్వాలి


పీడీకి విన్నవిస్తున్న జేఏసీ నాయకులు

ఆలూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఉద్యోగులకు డీఎస్సీ నియామకాల్లో వెయిటేజీ ఇవ్వాలని రాష్ట్ర పీడీ శ్రీనివాసరావును కోరినట్లు జేఏసీ కో కన్వీనర్ మొహమ్మద్ రఫీ తెలిపారు. జేఏసీ చైర్మన్ నాగేశ్వరావు ఆధ్వర్యంలో పీడీని కలిశామని, హెచ్ ఆర్ పాలసీ అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు.. కేజీబీవీ ఉద్యోగులకు సమ్మెకాలం నాటి వేతనాలు మంజూరు చేయడం పట్ల ధన్యవాదాలు తెలిమన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాంతారావు, ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, వైస్ చైర్మన్, బొమ్మి నాగరాజు జేఏసీ నాయకులు కల్యాణి, జన్ మోడీ, బాలాజీ, వీరాంజినేయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సీపీఎం బహిరంగ లేఖ

ఆస్పరి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నియోజవర్గంలోని రోడ్లు, తాగు, సాగునీటి ప్రాజెక్టుల సమస్యలపై ఎమ్మెల్యే విరుపాక్షికి బుధవారం సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వీరశేఖర్, హనుమంతు బహిరంగ లేఖ విడుదల చేశారు. ఆలూరు, దేవనకొండ, ఆస్పరి, చిప్పగిరి, హొళగుంద, హాలహర్వి మండలాల్లో రహదారులు గుంతలమయంగా మారాయని, వేదవతి ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలన్నారు. భూములు కోల్పోయిన రైతులకు ఎకరానికి రూ.20 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వేదవతి సామర్థ్యాన్ని ఎనిమిది టీఎంసీలకు పెంచి గ్రామాలలోని తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు. నగరడోణ, సిద్దాపురం, చింతకుంట చిన్న హోత్నూర్, ముత్తుకూరు, వెంగలాయి దొడ్డి చెరువు మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. బడ్జెట్ సమావేశాలలో ఎమ్మెల్యే పాల్గొని ఆలూరు సమస్యలపై మాట్లాడాలని కోరారు. రంగస్వామి, రామాంజినేయులు పాల్గొన్నారు.


బహిరంగ లేఖ విడుదల చేస్తున్న నాయకులు

ఉద్యమాలకు సిద్ధం కావాలి

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కార్మిక, రైతుల సమస్యల పరిష్కారానికి ఉద్యమాలకు సిద్ధం కావాలని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి మల్లికార్జున, ఐఎఫ్టీయూ జిల్లా కార్యదర్శి వెంకప్ప పిలుపు నిచ్చారు. బుధవారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ఎరువులు, విత్తనాల దరలను పెంచి రైతులపై భారం మోపిందని ఆరోపించారు. ప్రభుత్వ సంస్థలను కార్పొరేట్‌కు దోచిపెడుతోందని, బీజేపీ విధానాలపై తిరగబడాలని పిలపునిచ్చారు. ఈనెల 26న సమ్మెను జయప్రదం చేయాలన్నారు. అజయ్ బాబు, అంజిబాబు, వెంకన్న, రాజు, లక్ష్మారెడ్డి, ఈరన్న, గోపాల్, రసూల్, నరేష్ పాల్గొన్నారు.

కార్పొరేషన్ మెంబర్‌కు సన్మానం

పత్తికొండ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కువర కార్పొరేషన్ మెంబర్ గా ఎన్నికైన పర్ల(హోటల్) శ్రీనివాసులును టీడీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు బుధవారం సన్మానించారు. కన్వీనర్ కడవల సుధాకర్ , జిల్లా ఉపాధ్యక్షుడు సాంబశివారెడ్డి, బీసీ సంఘం నాయకుడు రామానాయుడు, మద్దికెర మాజీ జడ్పీటీసీ పురుషోత్తం చౌదరి శ్రీనును అభినందించారు.

లింగనిర్ధారణ చేస్తే చర్యలు

- ఆర్డీవో భరత్‌నాయక్, నోడల్ అధికారి నాగప్రసాద్‌బాబు హెచ్చరిక


మాట్లాడుతున్న ఆర్డీవో భరత్ నాయక్

పత్తికొండ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రులు, స్కానింగ్ సెటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఆర్డీవో భరత్‌నాయక్, పీసీ అండ్ పీఎన్‌డీటీ జిల్లా నోడల్ అధికారి నాగప్రసాద్‌బాబు హెచ్చరించారు. భ్రూణ హత్యల నివారణపై కార్యాలయంలో బుధవారం సమీక్షాసమావేశం నిర్వహించారు. లింగనిర్ధారణ, అబార్షన్‌ను నిషేధిస్తూ బారత ప్రభుత్వం 1994లో పీసీ అండ్‌పీఎన్‌డీటీ చట్టాన్ని ప్రవేశపెట్టిందన్నారు. చట్టాన్ని అతిక్రమిస్తే ఆసుపత్రి, స్రానింగ్ కేంద్రాన్ని సీజ్‌చేస్తామ న్నారు. ఎన్జీవోలు, వైద్యసిబ్బంది. పోలీసులు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా న్యాయ నిపుణులు చంద్రశేఖర్‌రెడ్డి, సుమలత, వైద్యాధికారి కల్పన, సీఐ జయన్న, ఎన్జీవో రామ్మోహన్ ఉన్నారు.

వ్యవసాయాన్ని లాభసాటిగా మారుద్దాం


పెరవలి గ్రామంలో కందిపంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

- పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

మద్దికేర, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ పద్ధతులలో వ్యవసాయాన్ని లాభసాటిగా మారుద్దామని శాస్త్రవేత్తలు రాజమహి, డాక్టర్ మోహన్ విష్ణువర్ధన్ అన్నారు. బుధవారం పెరవలి గ్రామంలో కంది పంటను పరిశీలించారు. రైతులు భూసార పరీక్షలు చేయించి, పంట మార్పిడి మాటిస్తే మంచి దిగుబడి సాధించవచ్చు నన్నారు. కందిలో మచ్చల పురుగు నివారణకు వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకోని మందులు పిచికారీ చేయాలన్నారు. శనగలో ఒడ తెగులు నివారణకు సూచనమేరకు మందుల వాడాలన్నారు. నంద్యాల శాస్త్రవేత్త రమాదేవి, సమన్వయకర్త రాఘవేంద్ర, ఏవో రవి ఉన్నారు.

డీఆర్ యూసీసీ సభ్యుడిగా ఆదోని వ్యాపారి

ఆదోని టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన వస్త్ర వ్యాపారి అరవింద్ కుమార్ యం గాంధీ డీఆర్ యూ సీసీ (దక్షిణ మధ్య రైల్వే వినియోగ దారుల సంఘం) సభ్యుడిగా ఎంపికయ్యారు. దక్షిణమధ్య రైల్వే సీనియర్ డివిజన్ కమర్షి యల్ మేనేజర్ నుంచి బుధవారం ఉత్తర్వులు అందాయి. రెండు సంవత్సరాల పాటు కొనసాగే కమిటీ సభ్యుడిగా తనను ఎంపిక చేయడం సంతోషంగా ఉందని అరవింద్ గాంధీ తెలిపారు. వ్యాపారులు, ప్రయాణికుల సమస్య లను కమిటీ ద్వారా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల సలహా సంఘం సభ్యుడు నసీరుద్దీన్ పటేల్ ఆయనను పూలమాలతో సన్మానించారు.


అరవింద్ గాంధీని సన్మానిస్తున్న పటేల్

భూ సమస్యలను పరిష్కరించాలి


మాట్లాడుతున్న అధికారులు

తుగ్గలి,నవంబరు13(ఆంధ్రజ్యోతి): రీ సర్వేతో నష్టపోయిన రైతుల భూ సమస్యలను పరిష్కరించాలని, వలసల నివారణకు పనులు కల్పించాలని సభ్యులు కోరారు. బుధవారం మండల పరిషత్ సమావేశభవనంలో ఎంపీపీ ఎర్రనాగప్ప ఆధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పాత విద్యుత్ స్థంబాలను తొలగించి కొత్తవి ఏర్పాటుచేయాలని కోరారు. స్పందించిన ఏఈ మహేశ్వర్‌రెడ్డి ఉన్నతాదికారుల దృష్టికి తీసుకెల్తామని సమాధానం ఇచ్చారు. జలజీవన్ కింద పెండింగ్ మంచినీటి పథకాలు పూర్తిచేయాలని కోరారు. జడ్పీటీసి పులికొండనాయక్, ఎంపిడివో విశ్వమోహన్, డిటి నాగరాజు, వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, ప్రణతి, వెంకటేష్, ఏపివో హేమసుందర్, ఎంఈవో రామవెంకటేష్ గౌడ్, కరీం, ప్రతాప్‌యాదవ్, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి

మద్దికెర, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): టీడీపీతో రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పట్టణ టీడీపీ అధ్యక్షుడు గద్దం రామాంజి, పంచాయతీ సభ్యుడు జమ్మునాథ్‌రాయుడు అన్నారు. బుధవారం మద్దకేరలో టీడీపీ సభ్యత్వ నమోదు చేపట్టారు.

ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను గౌరవించాలి

- కర్నూలు కథోలిక్ బిషప్ జ్వాన్నేసు గోరంట్ల

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను గౌరవించినప్పుడే ఉన్నతంగా రాణిస్తారని కర్నూలు కథోలిక్ బిషప్ జ్వాన్నేసు గోరంట్ల పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని సెయింట్ అంతోని ఎయిడెడ్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. బాలల దినోత్సవం సందర్భంగా ముందుగా చాచా నెహ్రూ చిత్రపటానికి నివాళి అర్పించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. కరస్పాండెంట్ పాదర్ జాన్‌డేవిడ్, విచారణ గురువు పాదర్ కోలా విజయరాజ్, హెచ్‌ఎం కేశవయ్య, మారెన్న, సిస్టర్ రేణుక, ఉపాధ్యాయులు నిర్మల మేరి, సిస్టర్ శౌరి, ప్రకాషమ్మ, శాంత, నరసన్న, రవి పాల్గొన్నారు.


బహుమతులు అందజేస్తున్న బిషప్

పారిశుధ్యం, తాగునీటిపై ప్రత్యేక చర్యలు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- ఈవోఆర్డీ మద్దిలేటి స్వామి



మద్దికెర, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో పారిశుధ్యం, తాగునీటి నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఈవోఆర్డీ మద్దిలేటి స్వామి అన్నారు. ఆయన ఆంధ్రజ్యోతికి ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న: పారిశుధ్యంపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: మండలంలోని 8 గ్రామ పంచాయితీల్లో పారిశుధ్య పనులు చేస్తున్నాం, మురుగుకుంటలు, కాలువలు ఉన్న చోట దోమల వ్యాప్తి చెందకుండా ఆయిల్ బాల్స్ వేసి, బ్లీచింగ్ పౌడర్‌ను చల్లిస్తున్నాము.

ప్రశ్న: సీసీ రోడ్లు ఏర్పాటు చేస్తున్నారా..?

జవాబు: అన్ని గ్రామాల్లో పల్లె పండుగలో భాగంగా సీసీ రోడ్ల నిర్మిస్తున్నాం, పనులు సక్రమంగా సాగుతున్నాయి.

ప్రశ్న: పించన్ల పంపిణీ ఎలా చేస్తున్నారు?

జవాబు: వృద్ధులు, దివ్యాంగులు, వితంతువుల ఇంటి వద్ద పంపిణీ చేస్తున్నాము.

ప్రశ్న: 15వ ఆర్థిక సంఘం నిధులు వచ్చాయా?

జవాబు: 8 పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు వచ్చాయి. పారిశుధ్యం, అభివృద్ధి కార్యక్రమాలకు ఖర్చు చేస్తాం.

ఘనంగా తులసి దామోదర కల్యాణం



తులసి దామోదర కల్యాణం చేయిస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి సన్నిధానంలో తులసీ దామోదర కల్యాణోత్సవం నిర్వహించారు. బుధవారం రాత్రి తులసి సన్నిధానంలో ఉత్థన ద్వాదశిని పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు బంగారు మూలపాదుకలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ రాయులను పల్లకిలో అధిష్ఠించి రమణీయంగా ఊరేగించారు. బంగారు మంటపంలో దామోదర తులసిలను వెండి,పట్టు వస్త్రాలు, గులాబి పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో పండిత కేసరి విద్వాన్ రాజాఎస్ గిరిరాజాచార్, ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహమూర్తి, సురేష్‌కోణాపూర్, అనంత పురాణిక్, రవికులకర్ణి, బద్రినాథ్, వ్యాసరాజాచార్ పాల్గొన్నారు.

శ్రీమఠం అన్నదానానికి విరాళం

మంత్రాలయం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠానికి బెంగుళూరుకు చెందిన నంధన్ అనే భక్తుడు రూ.2లక్షలు విరాళంగా ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజరు వెంకటేష్ జోషి తెలిపారు. బుధవారం దాత కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని సంపూర్ణ సేవలో భాగంగా రూ.2 లక్షలు చెక్‌ను విరాళం ఇచ్చినట్లు తెలిపారు. పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల,పుష్ప, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో సూపరిటెండెంట్ అనంతపురాణిక్, దత్తు స్వామి, నరసింహ దేశాయ్, శ్రీపాధ ఆచార్‌లు పాల్గొన్నారు.

రేపు డీపీఆర్‌సీ శిక్షణ తరగతులు

నందవరం, నంవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నందవరం ఎంపీడీవో కార్యాలయంలో డీపీఆర్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి శిక్షణ తరగతులు జరుగుతున్నట్లు ఎంపీడీవో పుల్లయ్య తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధి కార్యాచరణ ప్రణాళికపై మండలస్థాయి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు తప్పకుండా పాల్గొనాలని ఆయన తెలిపారు.

గ్రామ సమస్యలపై దృష్టి సారించండి

మంత్రాలయం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీరు, పరిశుభ్రత, విద్యుద్దీపాలు, వంటి అంశాలపై దృష్టి సారించి ప్రజలకు అందుబాటులో ఉండాలని ఈవోఆర్‌డీ ప్రభావతిదేవి అన్నారు. బుధవారం ఎంపీడీవో సమావేశ భవనంలో గ్రామ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లకు ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో రోడ్లు, మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించి బ్లీచింగ్‌పౌడర్ చల్లి శుభ్రపరచాలన్నారు. తాగునీరు సరఫరాలో నిర్లక్ష్యం వహించకుండా చేతిబోర్లు, తాగునీరు పంపిణీ చేసే విద్యుత్ మోటార్లు మరమ్మతుపై శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. సమావేశంలో వేణుగోపాల్, ఇశ్రత్ బాషా, స్వామినాథన్, మహేష్, వీరేష్, శ్రీనివాసులు, ఆల్‌ఫ్రైడ్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి

పెద్దకడబూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించకుండా సీటుకే పరిమితమైన తహసీల్దారు శ్రీనాథ్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు భాస్కర్ యాదవ్, మండల కార్యదర్శి వీరేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని పెద్దకడబూరులోని సీపీఐ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల సర్వేయర్ రైతులపై ఆగ్రహం వ్యక్తం చేయడం సరికాదన్నారు. సర్వేయర్‌పై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు అన్నదాత సుఖీభవ పేరుతో రైతులకు రూ. 20 వేల పెట్టుబడి సాయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఆంజినేయులు, తిక్కన్న, నాగరాజు, ఈరన్న, వీరేష్, గోపాల్, ఇర్ఫాన్ పటేల్ పాల్గొన్నారు.

నాగప్ప మృతి పార్టీకి తీరని లోటు: తిక్కారెడ్డి



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

పెద్దకడబూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకుడు నాగప్ప పార్టీకి తీరని లోటని, బాధిత కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుం దని పార్టీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని కల్లుకుంట గ్రామంలో టీడీపీ నాయకుడు నాగప్ప గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తిక్కారెడ్డి, నాయకులు రఘునాథ్ రెడ్డి, రమాకాంత్ రెడ్డి నాగప్ప మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మధుసూదన్‌రెడ్డి, బసలదొడ్డి ఈరన్న, యోసేపు, దశరథ రాముడు, మల్లికార్జున, మీసేవ ఆంజినేయులు, పక్కిరెడ్డి నరసింహులు, పాల్గొన్నారు.

జోరుగా మట్కా

- కోసిగిలో ఆర్టీసీ బస్టాండు, ఓ డాబా వద్ద దందా
- రోజు రూ.లక్షల్లో లావాదేవీలు!

కోసిగి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మట్కా మహమ్మారి వలలో పడి ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయి. కొంత మంది అప్పులపాలై ఆత్మహత్యలు కూడా చేసుకున్న సంఘటనలు లేకపోలేదు. కోసిగి మండల కేంద్రంలో మట్కా దందా ఐదేళ్లుగా జోరుగా సాగుతోంది. ఆర్టీసీ బస్టాండు ప్రాంతంతోపాటు, ఉరుకుంద రోడ్డులోని ఓ డాబా సమీపంలో మట్కా మూడు పువ్వులు, ఆరు కాయలుగా జోరందుకుంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి పోలీసులే సహకారం అందించినట్లు ఆరోపణలు ఉన్నాయి. కొత్తగా వచ్చిన ఎస్ఐ మట్కా నిర్వాహకులపై కేసులు నమోదు చేసి కొంత మందిని అరెస్టు చేసి మట్కా డాన్లను వదిలేశా రన్న విమర్శలు ఉన్నాయి. మట్కా డాన్లు మాత్రం మట్కా రాయడంలో వెనక్కు తగ్గడం లేదు. రోజుకు రూ.లక్షల్లో మట్కా బీట్ నడుస్తోందని స్థానికులు చెబుతున్నారు. కోసిగిలోని ఆర్టీసీ బస్టాండు మట్కాకు అడ్డాగా మారిందని, ఓ డాన్ కనుసన్నల్లో రోజు రూ.2లక్షల మేర బీట్ నడుస్తున్నట్లు పలువురు చెబుతున్నారు. అలాగే కోసిగిలోని ఉరుకుంద రోడ్డులో ఓ డాబాలో మట్కా బీటర్లు, డాన్లు చెలరేగిపోయి సుమారు రూ.లక్షల్లో బీట్ రాస్తున్నా పోలీసులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. తక్కువ సమయంలో సులభంగా డబ్బు సంపాదించాలనే అత్యాశతో పేద, మధ్యతరగతి ప్రజలు ఇళ్లను గుళ్ల చేసుకుంటున్నారు. మట్కా ఆడుతున్న వారిలో తరుచూ ఒకరిద్దరు పోలీసులకు పట్టుబడుతున్నప్పటికీ మట్కా డాన్లపై మాత్రం చర్యలు తీసుకోవడం లేదనేది ఆరోపణలు ఉన్నాయి. ఓపెన్, క్లోజ్, బ్రాకెట్, పానాగా, మట్కాను గంటల వ్యవధిలోనే రూ.లక్షల డబ్బులు ప్రజల నుంచి నిర్వహకులు కాజేస్తున్నారు. గూగుల్‌పే, ఫోన్ పే పద్ధతితో పాటు మొబైల్ బ్యాంకింగ్ సిస్టమ్ ద్వారా ఏజెంట్లు ఎవరికి అనుమానం రాకుండా లావాదేవీలు నడుపుతున్నట్లు సమాచారం.





మట్కాకు అడ్డాగా మారిన కోసిగి బస్టాండు

మట్కాను అరికడుతాం



మండలంలో మట్కా ఆడుతున్న వారిపై ఇప్పటికే కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిం చాం. గతంలో మట్కా ఆడిన వారిపై కేసులు నమోదు కాలేదు. రెండు నెలల్లోనే సుమారు ఐదుగురిపై కేసులు నమోదు చేశాం. త్వరలో మండలంలో మట్కాను పూర్తిగా అరికడుతాం. మట్కా ఆడితే కఠిన చర్యలు తప్పవు.

- చంద్రమోహన్, ఎస్ఐ, కోసిగి

మొక్కుబడిగా మండల సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ అమరేశ

కౌతాళం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అమరేశ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా కొనసాగినంది. వివిధ శాఖల అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. ఎంఈవో శోభారాణి మాట్లాడుతూ మండలంలోని పాఠశాలల్లో ఉపాధ్యాయులు కొరత తీవ్రంగా ఉందని మండలానికి 230 మంది ఉపాధ్యాయులు అవసరం కాగా ప్రస్తుతం కేవలం 116మంది ఉపాధ్యాయులు విధులను నిర్వహిస్తున్నారని తెలిపారు. మండలంలో హల్వి, కౌతాళం ఎస్ఎస్ ట్యాంకులకు మోటార్ల కోసం ప్రభుత్వానికి నివేదికలను పంపామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగమల్లయ్య తెలిపారు. మండలంలో దెబ్బతిన్న రోడ్లకు ప్యాచ్ వర్క్‌లను ప్రారంభిస్తామని ఆర్‌అండ్‌బీ ఏఈ సాయి సురేష్ తెలిపారు. మండలంలో వలసల నివారణకు ప్రభుత్వం మండలంలోని మేళిగనూరు వద్ద వరద కాలువను నిర్మించాలని రైతు సంఘం నాయకులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్బరాజు, తహసీల్దార్ మల్లికార్జున స్వామి, వైస్ ఎంపీపీలు లిఖిత రెడ్డి, బుజ్జిస్వామి, మండల కోఆప్షన్ మెంబరు మాబుసాబ్ వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వైభవంగా ద్వాదశి వేడుకలు

మంత్రాలయం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ద్వాదశి వేడుకలను రాఘవేంద్ర స్వామి మఠంలో బుధవారం వైభవంగా నిర్వహించారు. పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో తెల్లవారుజామునుంచే బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయులు స్వర్ణ రథంపై విహరించారు. భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘ వేంద్ర స్వామికి విశేష పూజలు చేశారు.

రంగు మారిన పరిమళ ప్రసాదం: రాఘవేంద్ర స్వామి మఠంలో భక్తులకు విక్రయించే పరిమళ ప్రసాదం కాషాయం రంగులోకి మార్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేష్ జోషి, శ్రీపతి ఆచార్ తెలిపారు. భక్తులు ప్రసాదంలో రంగు మార్పును గమనించి రాఘవేంద్ర స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరి

మంత్రాలయం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని మాధవరం ఎస్ఐ విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం మాధవరం ఉన్నతపాఠశాలలో హెచ్‌ఎం బోజ రాజు ఆధ్వర్యంలో చిన్నపిల్లలపై జరిగే అఘా యిత్యాలు, బాల్య వివాహాలు, నిరక్షరాస్యత, మహిళా చట్టాలు, రోడ్డు ప్రమాదాలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో ఉపాధ్యాయులు యుగంధర్, రాజశేఖర్, నీలకంఠస్వామి, నాగరాజు, వెంకటరమణ నాయక్, తారాదేవి, సుభాష్, కృపానందం, ఎర్రన్న, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

మంత్రాలయం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన బుధవారం రాత్రి మాధవరం సమీపంలో చోటు చేసుకున్నది. వివరాలు ఇలా ఉన్నాయి. సెంటో తోమాస్ మార్తోమా ఇంగ్లీషు మీడియం పాఠశాలలో మాధవరం గ్రామానికి చెందిన ప్రదీప్, వికాస్, జుజాజ్ 10వ తరగతి చదువుతున్నారు. ట్యూషన్ ముగించుకుని పాఠశాల నుంచి ఇంటికి వస్తుండగా రాంపురం నుంచి మాధవరం గ్రామానికి వస్తున్న మోటార్‌సైకిల్ వెనుకనుంచి విద్యార్థులను ఢీకొట్టింది. దీంతో ముగ్గురు విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు పాఠశాల ఉపాధ్యాయులు లింటు తరకన్, ఆనందు, సంసోన్‌కు సమాచారం ఇవ్వగా స్పందించి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చి గాయపడిన విద్యార్థులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని మాధవరం ఎస్ఐ విజయ్‌కుమార్ పరిశీలించి మోటర్‌సైకిల్ ఢీకొట్టిన వ్యక్తి కోసం గాలింపు చర్యలు చేప ట్టారు. ఇందులో ఒక విద్యార్థి పరిస్థితి విషమంగా ఉంది.

రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

పెద్దకడబూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 13,14వతేదీల్లో వాతావరణ శాఖ వర్ష సూచన చేసిందని, రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకొని, పంటలను కాపాడుకోవాలని ఏవో వరప్రసాద్ సూచించారు. బుధవారం మండలంలోని బాపురంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు పట్టణ సీఐగా శ్రీనివాసులు

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణ నూతన సీఐగా శ్రీనివాసులు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ సుదర్శన్ రెడ్డి జెన్ కో సీఐగా విజయవాడకు బదిలీ కాగా, కర్నూలు సైబర్ క్రైంలో సీఐగా పనిచేస్తున్న వి శ్రీనివాసులును ప్రభుత్వం ఎమ్మిగనూరుకు బదిలీ చేసింది. శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠినంగా వ్యవహరిస్తామని నూతన సీఐ అన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

కౌతాళం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉరుకుంద ఉన్నత పాఠశాల విద్యార్థి ఓంకార్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధా నోపాధ్యాయుడు గట్టూరి ఈరన్న తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అండర్-16 విభాగంలో తమ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థి ఓంకార్ గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి బేస్ బాల్ పోటీలలో ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని హర్షం వ్యక్తం చేశారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలి

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి



మంత్రి నారా లోకేశ్‌కు సమస్యలు విన్నవిస్తున్న రాఘవేంద్ర రెడ్డి

మంత్రాలయం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో పశ్చిమ ప్రాంతమైన మంత్రాలయం నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని టీడీపీ నియోజకరవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి కోరారు. బుధవారం అమరావతిలో నారా లోకేష్‌ను రాఘవేంద్ర రెడ్డి కలిసి సమస్యలను వివరించారు. సాగునీటి ప్రాజెక్టులు లేక పోవడం వల్ల కరువు ఎక్కువగా ఉండడంతో రైతు కుటుంబాలు వలసలు వెళ్తున్నారని తెలిపారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి చేయూతనివ్వాలని కోరారు. వలసల నివారణ కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాకేష్ రెడ్డి పాల్గొన్నారు.

రామలింగేశ్వరుడిని దర్శించుకున్న సినీ డైరెక్టర్



ఆలయంలో సినీ డైరెక్టర్ నాగేశ్వరరెడ్డి

నందవరం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గురుజాల రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని బుధవారం సినీ డైరెక్టర్ నాగేశ్వరరెడ్డి, నిర్మాత నాగిరెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ మర్యాదలతో నిర్వాహకులు హంపి స్వామి స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో రచయితలు భానుప్రకాష్, నివాస్ పాల్గొన్నారు.

సీఐని కలిసిన టీడీపీ నాయకులు

నందవరం, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు టౌన్ సీఐ శ్రీనివాసులను బుధవారం నందవరం టీడీపీ నాయకులు క్లస్టర్ ఇన్‌చార్జీలు ధర్మాపురం గోపాల్, మాచాపురం కాశీంవలి, దామానరసింహులు, నందవరం జనసేన మండల అధ్యక్షుడు యల్లప్ప మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు.

గోనెగండ్లలో రుద్రయాగం



రుద్రయాగం నిర్వహిస్తున్న శివయ్యస్వామి

గోనెగండ్ల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఐరన్‌బండ గ్రామంలో బుధవారం ఈశ్వరదేవాలయంలో రుద్రయాగాన్ని వీరశైవమఠం పీఠాధిపతి, వేద పండితులు నిర్వహించారు. రుద్రాభిషేకం చేశారు. అలాగే గోనెగండ్ల లోని నీలకంఠేశ్వరుని దేవాలయంలో వీరశైవ మఠం పీఠాధిపతి శివయ్య స్వామి రుద్రాభిషేకం నిర్వహించి పూజ లను ప్రారంభించారు. అలాగే మండల పరిధిలోని గాజులదిన్నె, కులుమాల, అలువాల, హెచ్ కైరవాడి, పెద్దనేలటూరు, చిన్ననేలటూరు, వేముగోడు, గంజహళ్లి, బైలుప్పల, అగ్రహారం గ్రామాల్లో కార్తీక పూజలు ప్రారంభమయ్యాయి. భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు జరుపుకున్నారు. ఈశ్వర దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోనెగండ్లలోని నీలకంఠేశ్వ ర ఆలయంలో సాయంత్రం భజన కార్యక్రమం నిర్వహించారు.

భగవద్గీతను పఠించాలి

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం వారి భగవద్గీత పుస్తకాలను మాచాని సోమప్ప బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు పంపిణీ చేశారు. బుధవారం విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు బసన్న గౌడు, సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశలోనే భగవద్గీత పఠనం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో భీమారెడ్డి, రమేష్, మురళి కృష్ణ, రామంజనేయులు పాల్గొన్నారు.

ఇసుక టాక్టర్లు పట్టివేత

నందవరం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండల పరిదిలోని తుంగభద్రతీరమైన నాగలదిన్నె దగ్గర నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు బుధవారం తహసీల్దారు శ్రీనివాసులు తెలిపారు. నాగలదిన్నె దగ్గర రీచ్ లేదని అక్కడ అక్రమంగా ఇసుక తరలించరాదని తెలిసిన కొంతమంది అక్రమంగా ఇసుక తరలిస్తున్నార న్నారు. పూర్తి వివరాలు తెలుసుకొని జరిమానా విధించాలా, సీజ్ చేయాలని గురువారం వివరిస్తామన్నారు. ఆయన వెంట ఆర్ఐ జర్మీయా ఉన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

పట్టణంలో బీటీ రోడ్ల ఏర్పాటు

మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి



ఎమ్మిగనూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన రహదారుల అభివృద్ధి, సెంట్రల్ లైటింగ్, మురుగుకాలువల్లో పూడిక తీయటం, పార్కుల సుందరీకరణ, సంతమార్కెట్ ఆధునీకరణ, శివారు కాలనీల్లో తాగునీరు, సీసీరోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

ప్రశ్న: పట్టణంలో అధ్వానంగా ఉన్న రహదారుల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: పట్టణంలోని ప్రధాన రహదాల అభివృద్ధికి రూ. రెండు కోట్లు నిధులు కేటాయించాం. ఎమ్మిగనూరు జాతరలోపు అన్ని ప్రధాన రహదారులను బీటీరోడ్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: పట్టణంలో సెంట్రల్ లైటింగ్ పనులు ఎంతవరకు వచ్చాయి ?

జవాబు: పట్టణంలో రూ. 60లక్షలతో సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టాం. దాదాపుగా పూర్తి కావచ్చాయి.

ప్రశ్న: పార్కుల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

జవాబు: రూ. 3.50కోట్లతో పట్టణంలో నాలుగు పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాం. ఇందులో ఒక పార్కును ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ద్వారా అభివృద్ధి చేస్తాం.

ప్రశ్న: 15వ ఆర్థిక సంఘం నిధులతో ఎలాంటి పనులు చేపడుతున్నారు ?

జవాబు: 15వ ఆర్థిక సంఘం నుంచి మంజూరైన నిధలు రూ. 13కోట్లతో పట్టణంలో ఇంటర్నల్ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు వంటి పనులు చేపడుతున్నాం. ఇప్పటికే కొన్ని పనులు జరుగుతున్నాయి.

ప్రశ్న: వీధి కుక్కలు, పశువుల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

జవాబు: ఇప్పటివరకు పట్టణంలోని 1800 వీధి కుక్కలకు ఆపరేషన్లు చేయించాం. మరో 589కుక్కలకు చేయించాల్సి ఉంది. అలాగే వీధిపశువుల్లో 90 శాతం గోశాలకు తరలించాం. మిగతా వాటిని కూడా తరలిస్తాం.

పరిశ్రమలపై అవగాహన అవసరం: ప్రిన్సిపాల్

మంత్రాలయం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే పరిశ్రమలపై అవగాహన ఉంటే జీవితంలో రాణించగలుగుతారని చిలకలడోణ కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్ శాంతి, ఫ్యాక్టరీ మేనేజర్ సమీర్, జీఎం రాజు అన్నారు. బుధవారం మంత్రాలయం మండలంలోని మాధవరం మారుతి ఇస్పాట్ (స్టీల్ ఫ్యాక్టరీ)లో చిలకలడోణ కస్తూర్బా తొమ్మిదవ తరగతి, ఆదోని బాలురు, బెళగల్, ఎమ్మిగనూరు బాలికలు స్టాండర్డు క్లబ్ ఆధ్వర్యంలో పరిశ్రమలపై క్షేత్రస్థాయిలో అవగాహన నిర్వహించారు. మట్టి నుంచి ఇనుము తయారీ, ముడిసరుకుల ఉపయోగం, యంత్రా పనివిధానం, ఉద్యోగులు తీసుకునే జాగ్రత్తలు, కడ్డీలు, ఇనుప పైపులు, కాలుష్యం, విద్యుత్ వాడకం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల వెంట సైన్స్ ఉపాధ్యాయులు అనసూయ, జరీనాలు పాల్గొన్నారు.

'అవినీతి అధికారికి రీ పోస్టింగ్ సరికాదు'

ఎమ్మిగనూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కేజీబీవీ ఎస్‌వో అధికారికి రీ పోస్టింగ్ ఇవ్వడం సరికాదని విద్యార్థి సంఘం నాయకులు మహేంద్రబాబు, శేఖర్, నరసన్న, వీరేష్ యాదవ్ అన్నారు. బుధవారం ఎమ్మిగనూరు పట్టణంలోని విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద విద్యార్థుల అభ్యున్నతి కోసం కేజీబీవీలను ఏర్పాటు చేశారని, అయితే ఎస్‌వోగా విధులు నిర్వహిస్తున్న అధికారి విద్యార్థుల పొట్ట కొట్టి సొమ్మును మెక్కడం దుర్మార్గం అన్నారు. ఎస్‌వోను ఉద్యోగం నుంచి తొలగించే వరకు దశల వారిగా ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు సురేంద్రబాబు, క్రిష్ణ, ఆఫ్రిద్, అజిత్, వెంకటేష్, నాగరాజు, నరసింహరెడ్డి, దావీదు పాల్గొన్నారు.

వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలి

గోనెగండ్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ గోనెగండ్లలో ఈ ఏడాది వందశాతం ఇంటిపన్నులు, కొళాయి పన్నులు, దుకాణాల పన్నులు వసూలు చేయాలని పంచాయతీ సిబ్బందిని గ్రామ మేజర్ సర్పంచ్ హైమావతి, ఈవో సతీష్ ఆదేశించారు. బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024-25 కు సంబంధించిన పన్నులు వందశాతం వసూళ్ల చేయాలని గతంలో పెండింగ్‌లో ఉన్న పన్నులు కూడా ఈ ఏడాది వసూళ్ల చేసి పంచాయతీ ఆదాయాన్ని పెంచి అభివృద్ధికి సహకరించాలని ప్రజలను కోరారు. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు నాలుగు ఓహెచ్‌ఆర్ ట్యాంక్‌ల నిర్మాణం చేపడుతున్నట్లు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ మలాంగ్ బాషా, సుభాను, అనిల్ తదితరులు పాల్గొన్నారు.